ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శుక్రవారం 19 జనవరి 2024

అరకొరగా.. మిడ్ డే మీల్స్





» మధ్యాహ్న భోజనంలో గుడ్డు మాయం
» ధర పెరిగిందంటున్న నిర్వాహకులు
» బోర్డులకే పరిమితమవుతున్న మెనూ
» అందరికీ అందని 'అల్పాహారం'
» కొరవడుతున్న అధికారుల పర్యవేక్షణ

వరంగల్ సిటీ, జనవరి 18: ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు కోడిగుడ్డు మాయమవుతోంది. మెనూ ప్రకారం వారంలో మూడు రోజులు గుడ్డు అందించాల్సి ఉండగా ధర భారీగా పెరగడంతో ఇప్పుడది మాయమైంది. గతంలో గుడ్డు ధరలు పెరిగిన ప్పుడు ప్రత్యామ్నాయంగా అరటి పండ్లు ఇచ్చేది, ఇప్పుడా ఏర్పాట్లు చేయకపోవడంతో జిల్లా విద్యా శాఖపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భోజనం కూడా నాసిరకంగా ఉంటోందని, మార్కెట్‌లో తక్కువ ధరలు ఉన్న కూరగాయలతోనే కూరలు వండుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు. మధ్యాహ్న భోజన నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక పోవడంతోనే ఇలా జరుగుతోందని మేధావులు పేర్కొంటున్నారు. జిల్లాలో 582 పాఠశాలల్లో 37,542 మంది విద్యార్థులకు అల్పాహారం అందించాల్సి ఉండగా ప్రస్తుతం 97 పాఠశాలల్లో 7,641 మంది విద్యార్థులకు మాత్రమే అల్పాహారం అందిస్తున్నారు. గుడ్డు ధర రూ.7కు పెరగడంతో ప్రభుత్వం అందిస్తున్న రూ.5తో ఏర్పాటు చేయడం సాధ్యమవడం లేదని మధ్యాహ్న భోజన కార్మికులు వాపోతున్నారు.

మధ్యాహ్న భోజనం మెనూ

సోమవారం, కిచిడీ, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, కోడిగుడ్డు, మంగళవారం రైస్, సాంబార్, వెజిటబుల్ కర్రీ, బుధవారం రైస్, ఆకుకూర పప్పు, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, కోడిగుడ్డు, గురువారం వెజిటబుల్ బిర్యానీ, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, శుక్రవారం రైస్, సాంబార్, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, గుడ్డు, శనివారం రైస్, ఆకుకూర పప్పు, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ.

గుడ్డుకు ప్రత్యామ్నాయం ఏది..

పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో గుడ్డు మాయం అవుతోంది. వారంలో సోమ, బుధ, శుక్రవారాలు మూడు రోజులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో గుడ్డు వడ్డించాల్సి ఉంది. కొద్ది రోజులుగా గుడ్డు అందడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. జిల్లాలో అక్కడక్కడ కొద్ది పాఠశాలల్లో తప్ప మిగతా అన్ని పాఠశాలల్లో గుడ్డు అందడం లేదని తెలుస్తోంది. గుడ్డు అందించని సమయాల్లో ప్రత్యామ్నాయంగా అరటి పండ్లు కూడా అందించడం లేదు. ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు రూ.5 మాత్ర మే చెల్లిస్తుందని, మార్కెట్‌లో గుడ్డు ధర రూ.7 పలుకుతుండటంతో నిర్వాహ కులు వాపోతున్నారు. ఇప్పటికే చాలిచాలని వేతనాలు, సరుకులకు సరిపడా డబ్బులు సమయానికి అందకపోవడంతోనే అప్పు లు తెచ్చి భోజనం అందిస్తున్నట్లు పేర్కొంటున్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపం..

విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకొని పటిష్టమైన మెనూను రూపొందించింది. ఆ మెనూ ప్రకారమే భోజనం అందేలా చూడాలని అధికారులకు సూచించింది. అయితే విద్యాశాఖ మాత్రం మధ్యాహ్న భోజన నిర్వహణపై పర్యవేక్షణ కరువైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాలల్లో నిర్వహణ తీరుపై మండల విద్యాశాఖాధికారులు, ఆర్పీలు పర్యవేక్షించాల్సి ఉండగా మొక్కుబడిగా పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో మార్కెట్‌లో తక్కువ ధరకు దొరుకుతున్న నాసిరకం కూరగాయలతోనే సరిపెడుతున్నట్లు ప్రచారం సాగుతోంది.



మిడ్ డే మీల్స్ పాఠశాలల వివరాలు

యాజమాన్యం	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక పాఠశాలలు	377	15,357
ప్రాథమికోన్నతపాఠశాలలు	69	3,293
ఉన్నత పాఠశాలలు	136	18,892
మొత్తం	582	37,542
అల్పాహారం అందుతున్న పాఠశాలలు		
ప్రాథమిక పాఠశాలలు	66	3,411
ప్రాథమికోన్నతపాఠశాలలు	8	645
ఉన్నత పాఠశాలలు	23	3,585
మొత్తం	97	7,641

అందరికీ అందని అల్పాహారం

గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన అల్పాహారం కార్యక్రమం సైతం కుంటి నడకలాగే సాగుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో 582 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 37,542 విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుతుండగా వీరందరికి అల్పాహారం అందించాల్సి ఉంది. ఇప్పటి వరకు 97 పాఠశాలల్లో మాత్రమే 'అల్పాహారం' ప్రారంభమైంది. ఇప్పటి వరకు 7,641 మంది విద్యార్థులకు మాత్రమే అల్పాహారం అందుతోంది.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా గంట రవికుమార్



వరంగల్ సిటీ, జనవరి 18: భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా వరంగల్ శివనగర్‌కు చెందిన గంట రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా శివనగర్‌కు చెందిన గంట రవికుమార్ బీజేపీలో యువనాయకుడికి అధ్యక్ష పీటం దక్కింది. అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ జిల్లా బీజేపీలో తనదైన ముద్ర వేసుకున్నారు. 2018లో జరిగిన గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్, ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేశారు. సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ అధినేతగా వేలాది మంది విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించారు. ఈసందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ తనకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి, బీజేపీ నేషనల్ జనరల్ సెక్రెటరీ బండి సంజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్‌తోపాటు జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

నేటి నుంచి నిట్‌లో టెక్నోజియాన్

» 'ఇన్‌జీనీయస్' థీమ్ మూడురోజుల పాటు నిర్వహణ
» ప్రారంభ వేడుకకు ప్రముఖ సైంటిస్ట్ ప్రొఫెసర్ శ్రీనివాసన్ సుందర రాజన్ రాక
» నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

నిట్‌క్యాంపస్ (కాజీపేట), జనవరి 18: వరంగల్ నిట్‌లో యేటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే టెక్నో ఫెస్ట్ టెక్నోజియాన్- 2024 జనవరి 19 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి తెలిపారు. గురువారం నిట్ సెనెట్ హాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడారు. నిట్ టెక్నోజియాన్ యువతకు, సాంకేతిక అభివృద్ధి అందించడంలో ఎంతగానో తోడ్పడిందన్నారు. ఈ ఫెస్ట్‌కు వివిధ ప్రాంతాల నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులు వినూత్న ఆలోచనలు సేకరించడానికి, వారి సామర్థ్యాలను, ప్రతిభను ప్రదర్శించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ టెక్నోజియాన్‌లో అనేక టాప్‌క్లాస్ ఈవెంట్‌లు ఉంటాయన్నారు. ప్రతీ ఏటా వివిధ థీమ్‌లతో నిర్వహించే టెక్నోజియాన్‌ను ఈ ఏడాది 'ఇన్‌జీనీయస్' అనే థీమ్‌తో నిర్వహిస్తున్నామన్నారు. ఇంజనీయస్ అంటే ఇన్నోవేషన్‌ను సూచిస్తుందని, ఇది అన్వేషణ, సృజనాత్మకత, సాంకేతిక పరివర్తన దాని స్ఫూర్తిని కల్పించే భావన అన్నారు.

కాగా, నిట్ అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించనున్న టెక్నోజియాన్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిట్ చెన్నై త్రిచి డైరెక్టర్‌గా పనిచేసిన ప్రొఫెసర్ శ్రీనివాసన్ సుందర రాజన్ హాజరుకానున్నారని నిట్ డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి చెప్పారు. ఏరోస్పేస్, మిస్సైల్‌కు సైంటిస్టుగా పని చేసిన ఆయన.. నిట్ టెక్నోజియాన్‌కు ముఖ్య అతిథిగా రావడం అభినందనీయం అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో రెడ్‌బస్ సీఈవో ప్రకాశ్ సంగం, ఇస్రో సైంటిస్ట్ టీఎస్ సురేశ్‌కుమార్ పాల్గొననున్నారని చెప్పారు. జహాజ్, ఆర్‌సీ బగ్గీ, హోవర్ మానియా, దర్చువల్ రియాలిటీ, డీబగ్గింగ్ మానియా, మొదలైన స్పాట్ ఈవెంట్‌లు నిర్వహిస్తున్నామన్నారు. ఇవే కాకుండా వర్క్‌షాపులు, సాంకేతిక కార్యక్రమాలు, క్విజ్ తోపాటు సుమారు 40 ఈవెంట్‌లు నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిధ సంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ సాంకేతిక ఆవిష్కరణలను ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ టెక్నోజియాన్‌లో పాఠశాలల విద్యార్థులు తమ నమూనాల, ఆలోచనలు కూడా ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాస్, టెక్నోజియాన్ ఫ్యాకల్టీ అడ్వయిజర్ పి.హరిప్రసాద్, ప్రొఫెసర్లు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, టెక్నోజియాన్ కోర్ టీం సభ్యులు చంద్రనాయక్, సాహత్, విష్ణు, స్ఫూర్తి విశాల్ పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జనవరి 18: నాబార్డు ద్వారా అందించే జీవనోపాధుల అభివృద్ధి నైపుణ్య శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. గురువారం రంగశాయిపేట ప్రాంతంలో నాబార్డు సౌజన్యంతో చేపట్టే జీవనోపాధిల అభివృద్ధి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలపై నాబార్డు ఇత్తడి, నగిషీ కళాకారుల సహాయ నూతన ప్రాజెక్టు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ జిల్లాలో ప్రాచీన ఇత్తడి నగిషీ కళాకారులను ప్రోత్సహించడంలో నాబార్డు సంస్థ అందిస్తున్న సహాయ సహకారాలు కళాకారులను వెన్నుతట్టి ప్రోత్సహించడం శుభపరిణామమన్నారు. జిల్లాలో మొదలైన ప్రాచీన ఇత్తడి నగిషీల కళ ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. రూ.23.38 లక్షలతో రంగశాయిపేట ప్రాచీన ఇత్తడి నగిషీ కళా కారులకు ప్రోత్సహిస్తూ సహాయం అందించే ప్రాజెక్టు రూపకల్పన చేయడం అభినందనీయమని అన్నారు. 60మంది కళాకారు క్లస్టర్‌కు ప్రోత్సాహం అందిస్తూ వారి అభివృద్ధిని కాంక్షిస్తూ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాబార్డు సీజీఎం సుశీల చింతల, రవి, చంద్రశేఖర్, పరిశ్రమల శాఖ అధికారి నర్సింహమూర్తి, మారి సంస్థ వైస్ చైర్మన్ హేమ నళిని, కళాకారుల అధ్యక్షులు మారపాక వెంకట్, ప్రణయ్‌కుమార్, ప్రవీణ్‌కు మార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

వ్యవసాయ శాఖ డైరీ ఆవిష్కరణ

తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం నూతన డైరీ 2024ను కలెక్టర్ గురువారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్, తెలంగాణ వ్యవసాయ శాఖ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షు డు సీహెచ్.యాకయ్య, సెక్రటరి రాంనర్సయ్య, కోశాధికారి కృష్ణారెడ్డి, అధికారులు హరిప్రసాద్, శ్రీధర్, వీరభద్రం, తన్వీ సాగరిక, శ్రీప్రియా, సఫియా, లలిత, సారంగం తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ..



ఆమంచ శ్యామ్ (ఫైల్)



కదరిక రవి (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి, ఆరుగురికి గాయాలు

బావుపేట వద్ద టాటా ఏస్‌ను ఢీకొన్న కారు

వేములవాడ వెళ్లి వస్తుండగా ప్రమాదం

ఉర్సు బొడ్రాయి కమిటీ అధ్యక్షుడు శ్యామ్ అక్కడికక్కడే

చికిత్స పొందుతూ తిమ్మాపూర్‌కు చెందిన ఆటో డ్రైవర్ రవి మృతి

బాధిత కుటుంబాల్లో విషాదం

వివరాలు : 6లో

బాలవికాస పథకాలు ఆలోచనలు రేకెత్తిస్తాయి..

» ప్రజలకోసం పనిచేసే బాలవికాసకు ప్రభుత్వ సహకారం ఉంటుంది
» రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కాజీపేట, జనవరి 18: బాలవికాస పథకాలు ప్రభుత్వాలకే ఆలోచనలు రేకెత్తించే విధంగా ఉంటూ పూర్తిస్థాయి ప్రజాసేవలో ఉంటాయని, ప్రజల కోసం పనిచేసే బాలవికాసకు ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం ఉంటుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. రాష్టంలో ఏ నూతన కార్యక్రమం మొదలు పెట్టినా అది బాలవికాస నుంచే మొదలవుతుందని అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ బాలవికాస ట్రెయినింగ్ సెంటర్‌లో గురువారం తాగునీటి శుద్ధీకరణ పథక కమిటీల మహాసభ జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. కొన్నేళ్లుగా బాలవికాస పలు రాష్ట్రాల్లో స్వచ్ఛందంగా ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. మహిళా పథకాలు, చెరువు పూడికతీత, అనాథలకు ఆశ్రమం, తాగు నీటిశుద్ధీకరణ, మరుగుదొడ్ల నిర్మాణం, వితంతు విముక్తి, మూఢనమ్మకాలను నిర్మూలించడం లాంటి కార్యక్రమాలు రూపొందిస్తూ పలు సంస్థలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇలాంటి ప్రజా ఉపయోగ కార్యక్రమాలు చేపడుతున్న సంస్థ వ్యవస్థాపకురాలు బాల థెరిస్సా అభినందనీయులన్నారు.

అనంతరం మంత్రి సీతక్కను బాలవికాస క మిటీ శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. అంతకు ముందు బాలవికాస సంస్థ వ్యవస్థాపకురాలు బాల థెరిస్సా మాట్లాడారు. బాలవికాస 47యేళ్లుగా పలు సేవాకార్యక్రమాలు చేపడుతోందన్నారు. పలు రాష్ట్రాలో నీ టిశుద్ధీకరణ పథకాలతో లక్షల మందికి మంచి నీరు అందిస్తున్నామని అన్నారు. బాలవికాస ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి మాట్లాడుతూ.. వాటర్ ప్లాంట్‌ల నిర్వహణలో గ్రామపంచాయతీ కమిటీలదే ముఖ్య పాత్ర అన్నారు.

ప్లాంట్ల నిర్వహణలో కమిటీలు సేవాభావంతో పని చేస్తే ఏ సమస్యలు రావన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ చీఫ్ ఇంజనీర్ డాక్టర్ శ్రీధర్, రాష్ట్ర పునరుద్ధరణ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ వరంగల్ మేనేజర్ మహేందర్‌రెడ్డి, బాలవికాస ఫెడరేషన్ డైరెక్టర్ కేడం లింగమూర్తితో పాటు వాటర్ ప్లాంట్ల కమిటీల అధ్యక్షులు, ఆపరేటర్లు, సోపార్ కెనడా ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ శోభ, బాలవికాస అధ్యక్షులు నో ముల ఇంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు బాసాని మర్రెడ్డి, సంస్థ ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అగ్గిపెట్టె..

మద్యం మత్తులో యువకుల గొడవ

ఇరువర్గాల దాడిలో గాయపడి

చికిత్స పొందుతూ బాలుడి మృతి

రాయపర్తి మండలంలో విషాదం

సంక్రాంతి పండుగ పూట ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి..

8లో..

చలో అయోధ్య!



అయోధ్య రామ్‌లల్లాకు ప్రత్యేక రైళ్లు

» వరంగల్ నుంచి ప్రతీ సోమవారం 'శ్రద్ధాసేత్'
» కాజీపేట నుంచి ప్రతీ శుక్రవారం యశ్వంత్‌పూర్-గోరక్‌పూర్ ఎక్స్‌ప్రెస్
» జనరల్ టికెట్ ధర రూ.400, స్లీపర్ రూ.685
» 30 నుంచి కాజీపేట మీదుగా స్పెషల్ ట్రైన్లు

వివరాలు : 7లో..



నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపు

● జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ● వరంగల్ ప్రాంతంలోని సీసీ రోడ్ల పరిశీలన

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండ సిటీ), జనవరి 18: నాణ్యతా ప్రమాణాలు పాటిస్తేనే పనుల బిల్లుల చెల్లింపులు చేస్తామని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. బల్దియా పరిధిలో వరంగల్ ప్రాంతంలోని ఫోర్ట్‌రోడ్‌లోని విద్యానగర్ కాలనీ, బృందావన్ పబ్లిక్ స్కూల్, రంగశాయిపేటలోని శ్రీసాయినగర్, నాగేంద్ర నగర్ ఫేజ్-2 ప్రాంతం, కరీమాబాద్ బండి వారి వీధి, ఉర్సు వాటర్‌ట్యాంక్ ప్రాంతాల్లో కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన సీసీ రోడ్లకు చెందిన బిల్లుల చెల్లింపు కోసం కమిషనర్ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. టెండర్ నిబంధనలకు లోబడి అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. నాణ్యత ప్రమాణాల్లో నిబద్ధత లేకుంటే బిల్లుల్లో కోత విధించడం జరుగుతుందన్నారు. రంగశాయిపేట ప్రాంతంలో రోడ్డుపై గృహ నిర్మాణ వ్యర్థాలను ఉంచిన యజమానికి పెనాల్టీ విధించాలన్నారు. అలాగే నాగేంద్ర నగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనానికి అనుమతి ఉందో లేదా పరిశీలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, ఈఈ శ్రీనివాస్, డీఈ రవికిరణ్, శానిటరీ సూపర్ వైజర్ సాంబయ్య, ఏఈలు మోజామిల్, హబీబ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించండి

టీయూఎఫ్ఐడీసీ పథకం కింద అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్ ముంపు నివారణ చర్యల్లో భాగంగా గతంలో సూచించిన అభివృద్ధి పనులే కాకుండా ఇందులో చేర్చాల్సిన పనులైన ఫ్లడ్ మేనేజ్‌మెంట్‌పైన తగు సూచనలు చేశారు. భద్రకాళి నాలా, బండ్ నుంచి వెళ్లే నాలా, చిన్న వడ్డెపల్లి చెరువు నుంచి, పెద్ద వడ్డెపల్లి నుంచి వెళ్లే నాలాలతోపాటు రిటైనింగ్ వాల్స్, బల్దియా పరిధిలోని 66వ డివిజన్లలో అవసరమైన ప్రాంతాల్లో కల్వర్టులు, అంతర్గత రహదారుల నిర్మాణాలపై ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, సిటీ ప్లానర్ వెంకన్న, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, ఈఈ శ్రీనివాస్, ఐటీ మేనేజర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ..

● రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి, ఆరుగురికి గాయాలు ● బావుపేట వద్ద టాటా ఏస్‌ను ఢీకొన్న కారు

హసన్‌పర్తి/కరీమాబాద్, జనవరి 18: దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా గురువారం రాత్రి టాటా ఏస్ వాహనాన్ని కారు ఢీ కొన్న సంఘటనలో వరంగల్‌లోని ఉర్సు - కరీమాబాద్‌కు చెందిన ఆమంచ శ్యాంసుందర్ (45), ఖిలావరంగల్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన డ్రైవర్ రవి (40) ఇద్దరు మృతి చెందారు. ఆరుగురు గాయపడ్డారు. హసన్‌పర్తి సబ్ ఇన్స్‌పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం..

ఉర్సు ప్రాంతానికి చెందిన ఉర్సు బొడ్రాయి కమిటీ అధ్యక్షుడు, మునిసిపల్ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న ఆమంచ శ్యామ్(53).. ఈనెల 16న కుటుంబసభ్యులతో కలిసి శ్రీ రాజరాజేశ్వరస్వామి దర్శనానికి వేములవాడకు బయలుదేరాడు. శ్యామ్ తల్లి లలిత, భార్య దేవి, కుమారుడు లక్ష్మణ్, సోదరుడు ఆమంచ సంతోష్, అతడి కూతురు అలేఖ్య, కుమారుడు నాగేంద్రతో కలిసి తిమ్మాపూర్ ప్రాంతానికి చెందిన కదరిక రవి(40) టాటా ఏఎస్ వాహనంలో వెళ్లారు. దర్శనం చేసుకుని గురువారం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం బావుపేట గ్రామం వద్దకు రాగానే ఆటో ట్రాలీని వెనుకనుంచి వచ్చిన ఓ కారు వేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమంచ శ్యామ్ అక్కడికక్కడే మృతి చెందగా, కుటుంబ సభ్యులతోపాటు, ఆటో డ్రైవర్ రవికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ రవి (40) మృతి చెందాడు. ఆటో డ్రైవర్ రవికి భార్య శ్రీవిద్య, కుమారులు కిరణ్ తేజ, రవితేజ, కూమార్తె శ్రీ కీర్తన ఉన్నారు. మరో మృతుడు ఆమంచ శ్యామ్ కుటుంబ సభ్యులు స్వల్పగాయాలతో బయటపడి ఎంజీఎంలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదానికి కారణమైన కారు



మృతి చెందిన ఆమంచ శ్యామ్

బస్సు ఎక్కితే ప్రాణాలు దక్కేవి..

ఆమంచ శ్యామ్ వేములవాడ నుంచి కరీంనగర్ చేరుకున్నాక తాను బస్సులో వస్తానని చెప్పి కరీంనగర్ బస్టాండ్‌కు వెళ్లాడు. కానీ, అక్కడ ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండటంతో తిరిగి ఆటోలోనే ఎక్కాడు. బస్సులో ఎక్కినా బతికేవాడని మృతుడి తల్లి ఆమంచ లతిత, అతడి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాగా, మృతుడు శ్యామ్ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడని స్థానికులు చెబుతున్నారు.

సంఘటితంతోనే సహకార సంఘాల ఆర్థిక పరిపుష్టి

ఐనవోలు మార్ట్‌ను సందర్శించిన నాబార్డు సీజీఎం సుశీల చింతల

ఐనవోలు, జనవరి 18: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(ప్యాక్స్) ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విశేషంగా కృషి చేస్తున్నాయని నాబార్డు సీజీఎం సుశీల చింతల తెలిపారు. నందనం ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ఐనవోలులో ఏర్పాటు చేసిన సూపర్‌మార్కెట్(మార్ట్) విక్రయకేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. మార్ట్‌లో వస్తువుల క్రయ, విక్రయాలు జరుగుతున్న తీరు, వినియోగదారులకు లభించే ధరలను పరిశీలించారు.



ఐనవోలులో మార్ట్‌ను పరిశీలిస్తున్న నాబార్డు సీజీఎం సుశీల చింతల, డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐనవోలులో ఏర్పాటు చేసిన మార్ట్ వినియోగదారులకు ఆకట్టుకునేవిధంగా ఉందన్నారు. పట్టణాల్లో కార్పొరేట్ స్థాయిల్లో ఏర్పాటు చేసే మార్ట్‌లకు తీసిపోనివిధంగా ఐనవోలు మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ప్యాక్స్ మార్ట్‌లో వస్తువులు, నిత్యావసర సరుకులు మార్కెట్ ధరలకంటే వినియోగదారులకు తక్కువకే విక్రయిస్తూ తాము సైతం ఆర్థికంగా ఎదిగేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కేవలం 10 మాసాల కాలంలో రూ.1.89 కోట్ల వ్యాపారం నిర్వహించి రూ.13 లక్షల లాభాలను ఆర్జించినట్లు గుర్తించామన్నారు. ఈ వ్యాపార కేంద్రంలో కీలక భూమిక పోషిస్తున్న నందనం ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సభ్యుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మొబైల్ విక్రయసేవలతోపాటు మార్ట్‌ల్లో కూరగాయల విక్రయం, విభిన్నరంగాల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు మహిళలు, రైతులకు శిక్షణ ఇచ్చి తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, నాబార్డు డీజీఎం శ్రీనివాసులు, డీడీఎం రవి, చంద్రశేఖర్, డీసీసీబీ బ్యాంక్ సీఈవో మహ్మద్ వజీర్‌సుల్తాన్, ఏజీఎం ఎల్. రాజశేఖర్, డీసీవో నాగేశ్వర్‌రావు, ఇంజనీర్ మోహన్, సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, డైరెక్టర్లు చిరంజీవి, శ్రీనివాస్, రాజారపు కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుల్లో మార్పులు

వరంగల్, ములుగు జిల్లాలకు రవికుమార్, బలరామ్

హనుమకొండ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ సంస్థాగత మార్పులను చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా అధ్యక్షులను మార్చింది. పలు జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించింది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ బాగాపని చేసిన జిల్లాల అధ్యక్షులను మాత్రం మార్చలేదు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. కొత్తగా నియమితులైన జిల్లా అధ్యక్షులకు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫోన్ చేసి సమాచారం అందించారు.

బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలుగా రావు పద్మను యథావిధిగా కొనసాగించారు. అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన పద్మ 20వేలకుపైగా ఓట్లు తెచ్చుకొని మూడోస్థానంలో నిలిచారు. అలాగే జనగామ జిల్లా అధ్యక్షుడిని కూడా మార్చలేదు. ప్రస్తుతం జనగామ జిల్లాకు డాక్టర్ ఎ.దశమంథరెడ్డిని కొనసాగించింది. అయితే మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల అధ్యక్షుల పేర్లను జాబితాలో పేర్కొనలేదు. పాతవారినే కొనసాగిస్తారా లేక ఈ జిల్లాల అధ్యక్షుల మార్పును పెండింగ్‌లో పెట్టిందా అన్న విషయమై స్పష్టత లేదు. మిగతా జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమించారు.

బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా గంట రవికుమార్‌ను, ములుగు జిల్లా అధ్యక్షుడిగా బలరామ్‌ను పార్టీ నియమించింది. మొత్తం 12 జిల్లాలకు కొత్త అధ్యక్షులను పార్టీ అధిష్ఠానం నియమించింది. ఆరు మోర్చాలకు కూడా కొత్త అధ్యక్షులను నియమించింది. ఇందులో భాగంగా ఎస్సీ మోర్చ అధ్యక్షుడిగా కొండేటి శ్రీధర్ నియమితులయ్యారు. శ్రీధర్ ఇంతకు ముందు వరంగల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు.

నగరంలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నయీంనగర్, జనవరి 18: ఎన్‌పీడీసీఎల్ హనుమకొండ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌జీవోస్ కాలనీ ఫేజ్-2, టీవీ టవర్ కాలనీ, వాటర్ ట్యాంక్, వెంకటేశ్వర్ ఆలయం, నాగరాజు ఆలయం ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. అదేవిధంగా ఎక్సైజ్ కాలనీ, కనకదుర్గాకాలనీ ప్రాంతాలలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, దర్గా, బాలసంతావాడ, హరిజనవాడ, హౌసింగ్ బోర్డు కాలనీ, ఫాతిమానగర్ ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, భవానీనగర్, హౌసింగ్‌బోర్డు, ఇందిరానగర్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, వడ్డెపల్లి, విజయ్‌పాల్‌కాలనీ, టీచర్స్‌కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు హనుమకొండ డివిజన్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ జి.సాంబరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అలాగే ఎన్‌పీడీసీఎల్ వరంగల్ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా గొర్రెకుంట సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్ ఇండస్ట్రియల్ ఏరియా ప్రాంతంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. అదేవిధంగా కరీమాబాద్ రోడ్, శాంతినగర్, రామాలయం, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, శంభునిపేట, రంగశాయిపేట, ఉర్సు, ఫోర్ట్ రోడ్, వాల్‌మార్ట్, అన్నపూర్ణ కాంప్లెక్స్, పద్మశాలి వీధి ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, మామునూర్, నక్కలపల్లి, బెస్తం చెరువు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, అరెపల్లి, అయ్యప్ప ఆలయం, అగ్రికల్చర్ కాలేజీ ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, పోచమ్మమైదాన్ సర్కిల్, మండిబజార్, బొందలకుంట ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు ఎలక్ట్రికల్, ఆపరేషన్ వరంగల్ డివిజనల్ ఇంజనీర్ శంకేషి మల్లికార్జున్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేయూలో స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు

కేయూ క్యాంపస్, జనవరి 18: కాకతీయ యూనివర్సిటీ ఇంగ్లీష్ విభాగం, సెంటర్ ఫర్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ టీచింగ్ (సీఇఎల్‌టీ) ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లీష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై 40 రోజుల పాటు శిక్షణ ఏర్పాటు చేసినట్లు సీఇఎల్‌టీ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మేఘనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 22 నుంచి ప్రతీ రోజు సాయంత్రం తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఆంగ్లభాష సామర్థ్యాల పెంపు, దినచర్యలో ఇంగ్లీష్ కమ్యూనికేషన్ పాత్ర, ఇంటర్వ్యూలు, గ్రూప్ డిస్కషన్, డిబెట్, వివిధ మాధ్యమాలను ఉపయోగించి సమాచార సేకరణ పంపటం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. వర్సిటీ విద్యార్థులకు రూ.వెయ్యి, ఇతర విద్యార్థులకు రూ.1500 చెల్లించాలని కోరారు. ఇతర వివరాలకు కేయూ ఇంగ్లీష్ విభాగంలో సంప్రదించాలని పేర్కొన్నారు.





చలో అయోధ్య!

అయోధ్య రామ్‌లల్లాకు వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్‌ల నుంచి ప్రత్యేక రైళ్లు

గిర్మాజిపేట, జనవరి 18 : అయోధ్యలో రామ మందిర నిర్మాణ పూర్తయిన సందర్భంగా అయోధ్య రామ్‌లల్లా మందిరానికి రైల్వే అధికారులు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. అయోధ్యకు దేశ నలుమూల నుంచి రైలు సదుపాయం కల్పించాలని రైల్వేశాఖ భావిస్తోంది. ఇప్పటి వరకు వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రజలకు నేరుగా అయోధ్య వెళ్లేందుకు రైలు సదుపాయం లేదు. అయితే రామ మందిరం ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు అందుబాటులోకి తెచ్చారు. అలాగే, వంద రోజులపాటు ప్రత్యేక రైళ్లను కాజీపేట నుంచి నడువనున్నాయి. అయోధ్యలో రద్దీ నేపథ్యంలో వీటిని అందుబాటులో ఉంచుతున్నట్టు రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. వంద రోజుల తర్వాత వీటిని ఇలాగే కొనసాగిస్తారా.. లేక రద్దు చేస్తారా.. అన్నది తెలియాల్సి ఉంది.

వరంగల్ నుంచి శ్రద్ధాసేత్ ఎక్స్‌ప్రెస్

వరంగల్ నుంచి నేరుగా అయోధ్యకు ఇటీవల రామేశ్వరం- అయోధ్య ధామ్ శ్రద్ధాసేత్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను అందుబాటులోకి తెచ్చారు. శ్రద్ధాసేత్ ప్రతీ ఆదివారం రాత్రి 11.50 గంటలకు రామేశ్వరం నుంచి బయలుదేరి సోమవారం రాత్రి 11.08 గంటలకు వరంగల్ చేరుకుంటుంది. వరంగల్‌లో రాత్రి 11.10 గంటలకు బయలుదేరి బల్లార్ష, నాగపూర్, ఈటార్సీ, జబల్‌పూర్, సత్నా, ప్రయాగరాజ్ మీదుగా బుధవారం ఉదయం 4.40 గంటలకు అయోధ్య ధామ్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. అలాగే, అయోధ్య నుంచి రామేశ్వరం ప్రయాణించే శ్రద్ధాసేత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారం రాత్రి 11.10 గంటలకు అయోధ్యలో బయలు దేరి శుక్రవారం తెల్లవారు జామున 2.03 గంటలకు వరంగల్ చేరుకుంటుంది. తిరిగి 2.05 గంటలకు వరంగల్ నుంచి బయలుదేరి విజయవాడ, గూడూరు మీదుగా రామేశ్వరానికి శనివారం తెల్లవారుజామున 3.10 గంటలకు చేరుకుంటుంది.

కాజీపేట నుంచి యశ్వంతపూర్-గోరక్‌పూర్ ఎక్స్‌ప్రెస్..

ప్రతీ శుక్రవారం కాజీపేట నుంచి అయోధ్యకు యశ్వంతపూర్-గోరక్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ఇటీవల అందుబాటులోకి వచ్చింది. గురువారం రాత్రి 11.40 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.08గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. 2 నిమిషాల అనంతరం కాజీపేట నుంచి బయలుదేరి శనివారం సాయంత్రం 4.24గంటలకు అయోధ్యధామ్ చేరుకుంటుంది.

టికెట్ ధరలు ఇలా..

రామేశ్వరం-అయోధ్య, ధామ్-రామేశ్వరం మధ్య నడిచే శ్రద్ధాసేత్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అన్ని వర్గాల ప్రజలు ప్రయాణించేలా రిజర్వేషన్‌తో పాటుగా జనరల్ బోగీలు ఉన్నాయి. సెకండ్ ఏసీ బోగీలు 2, థర్డ్ ఏసీ బోగీలు 3, స్లీపర్ బోగీలు 7, జనరల్ బోగీలు 2 ఉన్నాయి. జనరల్ బోగీలు ముందు ఒకటి. వెనుక ఒకటి ఉన్నాయి. వరంగల్ నుంచి అయోధ్యకు జనరల్ టికెట్ రూ.400, స్లీపర్ రూ.685, సెకండ్ ఏసీ రూ.2,570, థర్డ్ ఏసీ రూ.1,790 ఉంది. అయోధ్య నుంచి వరంగల్‌కు కూడా ఇవే ధరలు ఉన్నాయి. అలాగే కాజీపేట నుంచి అయోధ్యకు, అయోధ్య నుంచి కాజీపేటకు యశ్వంతపూర్- గోరక్‌పూర్-యశ్వంత్‌పూర్ రైల్‌లోనే ఇవే టికెట్ ధరలు ఉన్నాయని తెలిసింది. .

30 నుంచి కాజీపేట నుంచి ప్రత్యేక రైళ్లు

ఈనెల 22న అయోధ్యలో రామ్‌లల్లా ప్రతిష్ఠాపన నేపథ్యంలో అయోధ్యలో పెరగనున్న రద్దీ దృష్టిలో పెట్టుకుని రైల్వేశాఖ సికిందరాబాద్, కాజీపేట రైల్వేస్టేషన్‌ల నుంచి అయోధ్య ధామ్ స్టేషన్‌కు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఇందులో భాగంగా కాజీపేట- అయోధ్య ప్రత్యేక రైళ్లు కాజీపేట నుంచి ఈనెల 30, ఫిబ్రవరి 1, 3, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26,2 8 తేదీల్లో సాయంత్రం 6.20 గంటలకు అయోధ్యకు బయలుదేరుతాయి. సికిందరాబాద్ నుంచి అయోధ్య మధ్య నడిచే ప్రత్యేక రైళ్లు ఈనెల 29, 31, ఫిబ్రవరి 2, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25 తేదీల్లో సాయంత్రం 4.45గంటలకు సికిందరాబాద్ నుంచి అయోధ్యకు బయలుదేరుతాయి. ఈ రైళ్లన్నీ కాజీపేట మీదుగానే అయోధ్యకు వెళుతూ కాజీపేటలో ఆగుతాయి. సికింద్రాబాద్, కాజీపేట స్టేషన్‌ల నుంచి అయోధ్యకు వెళ్ల ప్రత్యేక రైళ్ల టికెట్‌ను కేవలం రైల్వేకి చెందిన ఐఆర్‌టీసీ వెబ్‌సైట్ ద్వారానే బుక్ చేసుకోవాలని రైల్వేశాఖ తెలిపింది. అయితే టికెట్ ధరలను ప్రకటించలేదు.

మిర్చి, పసుపు నాణ్యత ఉండేలా చూడాలి

స్పైసెస్ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ వి.విజిష్ట

వరంగల్‌టౌన్, జనవరి 18: మిర్చి పసుపు పంట సరుకు నాణ్యత ఉండేలా చూసుకోవాలని, అప్పుడే ఎగుమతులకు, గిట్టుబాటు ధర పలికే అవకాశ ఉంటుందని వరంగల్ రీజియన్ స్పైసెస్ బోర్డు అసిస్టెంట్ డైరెక్టర్ వి.విజిష్ట అన్నారు. గురువారం నగరంలోని వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో స్పైసెస్ బోర్డు వరంగల్ రీజియన్ ఆధ్వర్యంలో రైతులకు, వ్యాపారులకు అవగాహన సదస్సు చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విజిష్ట మాట్లాడుతూ.. సుగంధ ద్రవ్యాలు, పసుపు, మిర్చి నాణ్యతా ప్రమాణాలు పెంచుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రవిందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశంలోనే మిరప పంట ఉత్పత్తిలో తెలంగాణ లోని ఖమ్మం, వరంగల్ జిల్లాలో ఎక్కువగా సాగు అవుతుందన్నారు. పసుపు సాగుకు కూడా అనువైన భూములు ఇక్కడ ఉన్నాయన్నారు. స్పైసెస్ బోర్డు ల్యాబ్ వరంగల్‌లో లేకపోవడం వల్ల ప్రతీసారి హైదరాబాద్‌కు, లేదా గుంటూరుకు వెళ్లాలంటే రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మార్కెట్ కమిటీ స్పైసెస్ ల్యాబ్ ఏర్పాటుకు కావాల్సిన భూమి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా.. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాబార్డు అసిస్టెంట్ మేనేజర్ చంద్రశేఖర్, చాంబర్ ప్రతినిధులు మడ్డెరి వేదప్రకాష్, కైలాస హరినాథ్, రాజేశ్వర్‌రావు, గౌరిశెట్టి శ్రీనివాస్, రాయిశెట్టి సత్యనారాయణ, దేవర రమేష్ పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న విజిష్ట



కరపత్రాలు ప్రదర్శిస్తూ అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయురాలు సుధ

గురుకుల ప్రవేశ పరీక్షలపై ప్రచారం

హనుమకొండ రూరల్, జనవరి 18: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గురుకులాల్లో 2024-25 విద్యాసంవత్సరానికిగాను 5వ తరగతి ప్రవేశ పరీక్షపై ఓ ఉపాధ్యాయురాలు విస్తృత ప్రచారం చేస్తోంది. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని ధర్మసాగర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న మాడిశెట్టి సుధ గురుకుల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారి విద్యారాణి ఆదేశాలతో హనుమకొండ పద్మాక్షి కాలనీలో గురువారం ప్రచారం నిర్వహించారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఫిబ్రవరి 11వ తేదీన పరీక్ష ఉంటుందని ప్రచారంలో భాగంగా వివరిస్తున్నారు. గురుకుల పాఠశాలల్లో కల్పించే వసతులు, విద్యా ప్రమాణాలు, క్రీడలు తదితర అంశాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

కమిషనరేట్‌లో ఇద్దరు ఎస్‌ఐల బదిలీ

హనుమకొండ క్రైం, జనవరి 18: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒకే పీఎస్‌లో ఎక్కువ రోజు లు విధులు నిర్వర్తిస్తుండడంతో ఇద్దరికి స్థానచలనం కలిగించారు. హనుమకొండ పీఎస్‌లో పని చేస్తున్న బి.రామారావును చెన్నారావుపేటకు, చెన్నారావుపేటలో పనిచేస్తున్న పి.శ్రీనివాస్‌ను హనుమకొండకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. వీరు ఒకటి, రెండు రోజుల్లో విధుల్లో చేరాలని సీపీ అంబర్ కిశోర్ ఝా సూచించారు.

రైల్వే క్రికెట్ పోటీల్లో లోకోపైలెట్ టీం విజయం

కాజీపేట, జనవరి 18: కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో రైల్వే స్టేడియంలో నిర్వహిస్తున్న రైల్వే క్రికెట్ పోటీలు గురువారం మూడో రోజు కొనసాగాయి. ఈ పోటీలను డీఈఈ అభిషేక్ మిశ్రా, చీఫ్ క్రూకంట్రోలర్ ఎ.సాంబశివుడు హాజరై పోటీలను ప్రారంభించారు. చీఫ్ క్రూ కంట్రోల్ ('సీసీసీ)లోకోపైలెట్ టీం, మహబూబాబాద్ టీంలు మధ్య జరిగిన పోటీల్లో (సీసీసీ) లోకోపైలెట్‌ల టీం విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆపరేటింగ్ ఫ్రెండ్స్ టీం, వరంగల్ కింగ్స్ 11 టీం మధ్య జరిగిన పోటీలో ఆపరేటింగ్ ఫ్రెండ్స్ టీం విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, ట్రెజరర్ జి. రాజేశ్వర్‌రావుతోపాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో పదేళ్ల జైలు

వాజేడు, జనవరి 18: లైంగిక దాడి కేసులో ఒకరికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ములుగు కోర్టు తీర్పు వెలువరించింది. వాజేడు ఎస్సై సి.హెచ్.వెంకటేశ్వరరావు ఈ మేరకు గురువారం వెల్లడించారు. వాజేడు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021లో ఓ మహిళపై చెరుకూరుకు చెందిన యాలం భూపతిరావు లైంగికదాడి చేశాడు. బాధితురాలు వాజేడు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ కె.శివప్రసాద్, ఎస్సై కె. తిరుపతిరావు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు.

ప్రస్తుత సీఐ బండారి కుమార్, ఎస్సై వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో కోర్టు లైజన్ ఆఫీసర్ కమలాకర్, కోర్టు కానిస్టేబుల్ నాగరాజు సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టగా అడిషనల్ పీపీ సి.హెచ్.సత్యనారయణ కేసును వాదించారు. వాదోపవాదాల అనంతరం ములుగు జిల్లా జడ్జి లలితశివజ్యోతి ముద్దాయికి పదేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ. 18వేల జరిమానా విధించారు.

నర్సంపేటలో దొంగల హల్‌చల్

తాళం వేసి ఉన్న రెండిళ్లల్లో చోరీ



చోరీకి గురైన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సిబ్బంది

నర్సంపేట టౌన్, జనవరి 18: రెండిళ్లలో దొంగలు పడి బుధవారం రాత్రి నగలు, నగదు దోచికెళ్లారు. ఈ ఘటనలో రూ.7లక్షల నగదు అపహరణకు గురైంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. హనుమకొండ ప్రాంతానికి చెందిన మొలుగూరి నాగేందర్ కుటుంబం ఆరు నెలలుగా నర్సంపేట పట్టణంలోని మహబూబాద్‌లోని ఓం సాయినగర్‌లోని ఓ ప్లాట్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. నాగేందర్ కొద్ది రోజులుగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి జాతరలో జాయింట్ వీల్ (ఎగ్జిబిషన్) వ్యాపారం నిర్వర్తిస్తూ అప్పుడప్పుడు ఇంటికి వచ్చిపోతున్నాడు. భర్తకు తోడుగా ఉండేందుకు నాగేందర్ భార్య శిరీష, కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 16న ఇంటికి తాళం వేసి జాతరకు వెళ్లింది. కాగా, నాగేందర్, శిరీషలు గురువారం తెల్లవారు జామున 3 గంటలకు ఇంటికి రాగా, ఇంటి మెయిన్ డోర్‌కు వేసి ఉన్న తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండడం, అందులోని రూ.7 లక్షల నగదు కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి లబోదిబోమన్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా టౌన్ సీఐ సుంకరి రవీందర్, ఎస్సై శీలం రవి, క్లూస్ టీమ్ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడు నాగేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు. ఇదిలావుండగా, నాగేందర్ ఇంటి పక్కన ఉన్న ఇమ్మడి వెంకటేశ్వర్లు, పద్మల కుటుంబం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని కొడుకు వద్దకు వెళ్లారు. వీరి ఇంటి తాళాలు సైతం దొంగలు పగులగొట్టి ఇంట్లో వస్తువులన్నీ చిందరవందర చేశారు. విషయాన్ని పోలీసులు వెంకటేశ్వర్లు కుటుంబానికి సమాచారం అందించినప్పటికీ వారి నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ వివరించారు.

వెల్‌నెస్ సెంటర్‌కు ఏర్పాట్ల పరిశీలన

కాళోజీ జంక్షన్, జనవరి 18: కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఉన్న ఉద్యోగులకు, విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్య చికిత్సలు అందించేందుకు హనుమకొండలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయడానికి అవసరమైన వనరుల ఏర్పాటు కోసం సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ సర్వీస్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.లక్ష్మయ్య గురువారం హనుమకొండకు వచ్చారు. ఈ మేరకు ఆయన వసతి కోసం హనుమకొండ పోస్టాఫీస్ వెనుక గల క్వార్టర్లను, సీఆర్‌పీఎఫ్ క్యాంపులో గల క్వార్టర్లు పరిశీలించారు. వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు కనీసం 6వేల మంది ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఉండాల్సి ఉంటుందని వరంగల్, హనుమకొండ పట్టణాలతో పాటు పరిసర ప్రాంతాల్లో వారి సంఖ్య సుమారు 10వేలకు పైగానే ఉన్నట్లు వివరాలను సేకరించారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు 25 ప్రాంతాల నుంచి వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు వచ్చినట్లు తెలిసింది. రాష్ట్రంలో ఒక్క హైదరాబాద్‌లో మాత్రమే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం వెల్‌నెస్ సెంటర్ పనిచేస్తోంది. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అత్యంత ప్రాధాన్యత గల ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు అన్ని విధాలుగా అర్హతలు ఉన్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ అభిప్రాయపడినట్లు తెలిసింది. హనుమకొండలో ఏర్పాటు చేసే ప్రతిపాదనను మరో వారం రోజుల్లో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సమక్షంలో ఏర్పాటు చేయనున్నారు. సమావేశంలో హనుమకొండ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు కొలిక్కి రానున్నట్లు తెలుస్తోంది.

గృహహింస కేసులో మూడేళ్లు జైలు శిక్ష

నర్సింహులపేట, జనవరి 18 : గృహహింస కేసులో ఒకరికి మూడేళ్లు జైలు శిక్ష పడినట్లు ఎస్సై జి.సతీష్ గురువారం తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని పడమటిగూడెం గ్రామానికి చెందిన కొండ రమేష్‌తో పెద్దనాగారం గ్రామానికి చెందిన తేజస్వినికి 2007లో వివాహమైంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మగ సంతానం రమేష్ వేరొక మహిళను 2013లో వివాహం చేసుకున్నాడు. అప్పటినుంచి తేజస్వినిని తరుచుగా వేధిస్తూ, మానసికంగా హింసిస్తూ, వరకట్నం తేవాలని ఇబ్బందులకు గురి చేస్తుండటంతో తట్టుకోలేక 2014లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో తేజస్విని ఫిర్యాదు చేసింది. కేసు విచారణ చేపట్టిన తొర్రూరు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సరిత పోలీసులు ప్రవేశపెట్టిన ఆధారాలు, సాక్షులను విచారించిన అనంతరం ముద్దాయి రమేష్‌కు మూడేళ్ల కారాగార శిక్ష విధించినట్టు ఎస్సై తెలిపారు.

కొనసాగుతున్న ముందస్తు మొక్కులు

మేడారానికి భారీగా తరలివచ్చిన భక్తులు



మేడారం, జనవరి 18: వనదేవతలకు భక్తులు గురువారం ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి కుటుంబ సమేతంగా తల్లులను దర్శించుకున్నారు. సుమారు 50 వేల మంది హాజరయ్యారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 21 నుంచి మహాజాతర జరగనుండగా ముందస్తుగా మొ క్కులు చెల్లించుకొనేందుకు వచ్చారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో తలనీలాల సమర్పించారు. సమ్మక్క సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెల వద్ద పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీరె సారె, కొబ్బరికాయలు బెల్లం(బంగారం) సమర్పించారు.



మేడారంలో వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

ట్రాఫిక్‌జామ్‌కు తావివ్వం

వాహనాల మళ్లింపునకు ప్రత్యేక చర్యలు : ఎస్పీ డాక్టర్ శబరీశ్

ములుగు కలెక్టరేట్, జనవరి 18: మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర నేపథ్యంలో వరంగల్-మేడారం వెళ్లేమార్గంలో ట్రాఫిక్‌జామ్ కాకుండా వాహనాల మళ్లింపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ములుగు ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. గురువారం ఆయన పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి ములుగు సమీపంలోని గట్టమ్మతల్లి దేవాలయం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మేడారం మహాజాతరకు వెళ్లే భక్తులు ముందుగా గట్టమ్మతల్లిని దర్శించుకుని వెళతారని, ఈక్రమంలో వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, ద్విచక్రవాహనాలను క్రమపద్ధతిలో మళ్లించేందుకు అన్నిరకాల భద్రతా చర్యలు చేపడుతున్నామని అన్నారు. వాహనాల రద్దీని తగ్గించేందుకు అనుభవజ్ఞులైన పోలీస్ అధికారులు, సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తారని, అనుకోని విధంగా వాహనాలు మరమ్మతులకు గురైతే వాటిని వెనువెంటనే క్రేన్ల ద్వారా క్లియర్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూస్తామని అన్నారు. రాత్రివేళల్లో డైవర్షన్ పాయింట్లలో రేడియం స్టిక్కర్లతో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామని, గట్టమ్మతల్లి దేవాలయం చుట్టుపక్కల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా ఉండే దుకాణాలను తొలగించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయన వెంట ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఎస్పీ రవీందర్, ఎస్సై వెంకటేశ్వర్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.



గట్టమ్మతల్లి దేవాలయం ఆవరణలో అధికారులతో చర్చిస్తున్న ఎస్పీ శబరీశ్



వ్యాపారులకు నోటీసులు అందిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

ప్లాస్టిక్ వినియోగంపై వ్యాపారులకు నోటీసులు

మేడారం, జనవరి 18 : మేడారంలో ప్లాస్టిక్ వినియోగంపై గ్రామ పంచాయతీ అధికారులు కొరడా ఝుళిపించారు. పలువురు వ్యాపారులకు గురువారం నోటీసులు జారీ చేశారు. ప్లాస్టిక్ ఫ్రీ మహాజాతరగా జరుపుకునేందుకు అందరూ సహకరించాలని కోరారు. దీన్ని పాటించని వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గద్దెల పరిసరాల్లో ఉన్న దుకాణాదారులను వెంటనే తొలగించుకోవాలని ఆదేశించారు.

గ్రామ కార్యదర్శులకు విధుల కేటాయింపు

తాడ్వాయి మండలం మేడారంలో మహా జాతరలో విధులు నిర్వహించేందుకు గ్రామ పంచాయతీల కార్యదర్శులకు విధులు కేటాయించారు. డీపీవో వెంకయ్య ఆదేశాల మేరకు డీఎల్‌పీవో స్వరూప గురువారం ఈ కేటాయింపులు చేశారు. ములుగు జిల్లాలోని 150 మంది కార్యదర్శులకు ఎంపీవోలు శ్రీధర్‌రావు, శ్రీకాంత్‌నాయుడు, కుమార్, హనుమంతరావు, రహీం, శ్రీనివాస్, సాజిదా , మమత విధులు కేటాయించారు. మేడారం పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణకు సూపర్‌వైజర్లను నియమించారు. మహాజాతర ముగిసే వరకు వీరందరూ విధులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

కాళేశ్వరంపై కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ

మహదేవపూర్ రూరల్/మహదేవపూర్, జనవరి 18: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణల నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ అధికారులు చేపట్టిన విచారణ రెండోరోజు గురువారంకూడా కొనసాగింది. ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు, కన్నెపల్లి పంప్‌హౌస్‌ను డీజీ రాజీవ్ రతన్ నేతృత్వంలోని బృందం క్షేత్రస్థాయిలో పర్యటించింది. సమారు ఎనిమిది గంటలపాటు ఇరు బ్యారేజీలు, పంప్‌హౌస్‌లో పర్యటించిన అధికారులు జరిగిన నష్టం, దానికి కారణాలపై ఆరా తీశారు. పలు అంశాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

- ఎనిమిది గంటలపాటు పరిశీలన

మహదేవపూర్ మండలంలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌కు గురువారం ఉదయం 9.30 గంటలకు విజిలెన్స్ డీజీ రాజీవ్ రతన్‌తోపాటు ఎస్పీ బాలకోటి, పది మంది అధికారులు చేరుకున్నారు. సుమారు రెండున్నర గంటలపాటు పంప్‌హౌస్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అండర్‌గ్రౌండ్‌లో ఉన్న మోటార్లు, వాటికి అనుసంధానంగా కంప్యూటర్లను పరిశీలించారు. వాటితోపాటు దెబ్బతిన్న ప్రాంతంలో జరిగిన నష్టం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫోర్‌బే, అప్రోచ్ కెనాల్, డెలివరీ చానళ్లను పరిశీలించిన అధికారులు వరదలకు ముందు, తర్వాత పంప్‌హౌస్ పరిస్థితిపై ఆరాతీశారు. నష్టం జరగడానికి కారణాలను ఇంజనీర్లను అడిగితెలుసుకున్నారు. అనంతరం గ్రావిటీ కెనాల్ మార్గంలో అన్నారం బ్యారేజీకి చేరుకున్న బృందం సుమారు రెండున్నర గంటలపాటు పరిశీలన చేశారు. బ్యారేజీలో బుంగలుపడి నీటి లీకేజీ కాగా ఆప్రాంతంలో అధికారులు చేపట్టిన మరమ్మతులను పరిశీలించారు. దీంతో పాటు గేట్ల వద్ద నీటి లీకేజీ కావడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్, అన్నారం బ్యారేజీల పరిశీలన అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు తిరిగి కాళేశ్వరంలోని హరిత హోటల్‌కు చేరుకుని మధ్యాహ్న భోజనం చేశారు.

హరిత హోటల్ నుంచి మేడిగడ్డ బ్యారేజీకి బయల్దేరిన బృందం అక్కడ సుమారు మూడు గంటలపాటు పర్యటించారు. ముందుగా బ్యారేజీ వంతెన పైనుంచి బ్లాక్-7లో కుంగిపోయిన 20వ పిల్లరును పరిశీలించారు. అనంతరం మహారాష్ట్ర వైపు నుంచి నేరుగా వంతెన దిగువకు వెళ్లారు. బ్లాక్-7లో దెబ్బతిన్న 20పిల్లరుతోపాటు దెబ్బతిన్న మిగతాపిల్లర్ల కుంగుబాటుకు గల కారణాలు, జరిగిన నష్టం గురించి ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్యారేజీ గేట్లను దిగువ నుంచే పరిశీలించిన అధికారులు తిరిగి పైకి చేరుకుని ఆ ప్రాంతాన్ని మళ్లీ పునఃపరిశీలించారు. గేట్ల లిఫ్టింగ్ ప్రక్రియతోపాటు అవి ఎంతమేర ప్రవాహాన్ని తట్టుకోగలవు.. వాటి సామర్థ్యాలు ఏమిటి? అనే విషయాలపై ఆరా తీశారు. బ్యారేజీలో కుంగిపోయిన పిల్లర్లతో పాటు వంతెన దృశ్యాలను విజిలెన్స్ అధికారులు తమ ఫోన్లలో చిత్రీకరించారు. అక్కడి నుంచి నేరుగా మేడిగడ్డ బ్యారేజీ కంట్రోల్‌రూం కార్యాలయానికి చేరుకుని అధికారులతో సమీక్షించారు. అనంతరం కాళేశ్వరంలోని హరితహోటల్‌కు తిరిగి వెళ్లిపోయారు.

విజిలెన్స్ అధికారుల పర్యటనకు కొన్ని గంటల ముందు కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు మేడిగడ్డ బ్యారేజీ వద్ద క్షేత్రస్థాయిలో పర్యటించారు. విజిలెన్స్ అధికారులు ఎక్కడెక్కడ పరిశీలించనున్నారో ఆ ప్రాంతాల్లో ఆయన తిరిగారు. ఆయన వెళ్లిపోయిన వెంటనే విజిలెన్స్ అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఇది యాధృచ్ఛికమా.. ముందుస్తుగా జాగ్రత్త పాటించేందుకే ఈఎన్సీ పర్యటించారా? అనేది చర్చనీయాంశమైంది.



కన్నెపల్లి పంప్‌హౌజ్ ఫోర్‌బే వద్ద విజిలెన్స్ అధికారులు



'కార్యకర్తలకు అండగా ఉంటా'

ఖిలావరంగల్, జనవరి 18: బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటానని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. గురువారం క్రిస్టియన్‌కాలనీలో 141వ, బూత్ బీఆర్ఎస్ నాయకులు, ముఖ్యకార్యకర్తల సమావేశంలో కార్పొరే టర్ వస్కుల బాబు ఆధ్వర్యంలో జరిగింది. నరేందర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో బీఆర్ఎస్ ఓడిపోయిందని, కార్యకర్తలు కృంగిపోవద్దని, ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

మహనీయుడు ఎన్టీఆర్

వరంగల్‌టౌన్, జనవరి 18: దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా నగరంలోకి ఆయనకు నివాళులర్పించారు. 14వ డివిజన్ ఏనుమాముల ఎన్‌టీఆర్‌నగర్‌లో ఆ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పాశికంటి రమేష్ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. పాశికంటి రమేష్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం ఎన్టీఆర్ ఎంతోకృషి చేశారన్నారు. కార్యక్రమంలో ముంద్రాతి శరత్ బాబు, లాసాని నర్సింగరావు, వడ్నాల నరేందర్ పాల్గొన్నారు.

●గీసుగొండ: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు(ఎన్‌టీఆర్) వర్ధంతిని కొనాయిమాకుల వద్ద గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టీఆర్ చిత్రపటానికి అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాటి సాంబశివరావు, చెరుకుపల్లి సాంబరెడ్డి, కేదాసి స్వామి, కొనాయిమాకుల మాజీ సర్పంచ్ డోలి రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

●ఖిలావరంగల్: పేదల పెన్నిధి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, నందమూరి తారకరామారావు(ఎన్టీఆర్) ఆశయాలను నేటి యువత కొనసాగించాలని అఖిల భారత నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం రాష్ట్ర కన్వీనర్ జీఎల్ శ్రీధర్ అన్నారు. గురువారం ఖమ్మంరోడ్ వద్ద ఎన్‌బీకే వరంగల్ జిల్లా అధ్యక్షుడు నల్లకుంట రవికుమార్ ఆధ్వర్య ంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగవెళ్లి సురేష్, సిరబోయిన రాజు, గణేష్‌సింగ్, సంపత్, రాములు, సుదర్శన్, కందూకూరి చిన్నరవి పాల్గొన్నారు. అలాగే, ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా లేబర్‌కాలనీలో టీడీపీ డివిజన్ అధ్యక్షుడు బరిగెల సుధాకర్ ఆధ్వర్యంలో పండ్లను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా జీఎల్ శ్రీధర్, టీడీపీ నాయకులు చిలువేరు రవిందర్, నాగవెళ్లి సురేష్, కంద్రాతి రాజు, కొల్లూరి డేవిడ్, సిరబో యిన రాజు, అచ్చ లక్ష్మీనారాయణ, బజ్జూరి వీరేశం పాల్గొన్నారు.

● సంగెం: తీగరాజుపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ పార్టీ సీనియర్ నాయకుడు రావుల వేంకటేశ్వర్లుతోపాటు పలువురు నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పలు సంస్కరణలు తెచ్చిన ఎన్టీఆర్ దేశానికి మార్గ దర్శకులుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఇటికాల రాజేశ్వరరావు, రావుల అశోక్ పాల్గొన్నారు.



తీగరాజుపల్లిలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రావుల వెంకటేశ్వర్లు తదితరులు



ఎన్‌టీఆర్‌నగర్‌లో వర్ధంతిలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు



కొనాయిమాకుల వద్ద ఎన్‌టీఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎన్‌బీకే కన్వీనర్ శ్రీధర్

ఈకేవైసీలో నమోదు చేయించుకోవాలి

సంగెం, జనవరి 18: రేషన్ కార్డుదారులంతా ఈకేవైసీలో (వేలిముద్ర) నమోదు చేయించుకోవాలని సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల్లోని రేషన్‌కార్డుదారులంతా ఆయా గ్రామాల్లోని రేషన్ షాపుల్లో రేషన్ కార్డులో ఉన్నటువంటి కుటుంబ సభ్యులంతా ఈకేవైసీలో నమోదు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వం ఈనెల31 వరకు గడువు ఇచ్చిందన్నారు.

నిర్భయ, గృహ హింస చట్టాలపై అవగాహన



సఖీ కేంద్రం ఆధ్వర్యంలో మహిళలతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న సుధ

వరంగల్ కలెక్టరే ట్, జనవరి 18: జిల్లాలో మహిళలకు నిర్భయ, గృహహింస నిరోధక చట్టంపై అవగాహన కల్పించడం జరుగుతోందని సఖీ కౌన్సిలర్ సుధా అన్నారు. సఖీ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఊకల్-ఎలుకుర్తి హవేలి గ్రామాలలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్ ఆవిష్కరించారు. మహిళల కోసం కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లాలో సఖీ కేంద్రాలను ఏర్పాటుచేశారని తెలిపారు. ఈ సందర్భంగా మహిళా హెల్ప్‌లైన్ సహాయం తీసుకోవాలని వెంటనే ఫోన్ చేసిన వారికి సహాయం అందుతుందని తెలిపారు. హెల్ప్‌లైన్ నంబర్ 181, 0870- 3571832 కాగా కార్యక్రమంలో వీవోఏలు జయలత, పద్మ, మహిళలు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో స్వచ్ఛ తీర్థ అభియాన్

వరంగల్‌టౌన్, జనవరి 18: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పలుపు మేరకు కాశిబుగ్గలో శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో గురువారం బీజేపీ నగర కమిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛ తీర్థ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శుభ్రపరిచారు. ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ..ప్రతీ ఒక్క హిందువు దేవాలయాలను శుభ్రపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, రాజేశ్వర్‌రావు, సిద్దం నరేష్, రత్న క్రిష్ణకిషోర్, తిరుపతి రెడ్డి, ప్రభాకర్, మహేష్, పూర్ణచందర్, నాగరాజు పాల్గొన్నారు.



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

- డీఆర్డీవో పీడీ సంపత్‌రావు

సంగెం, జనవరి 18: పేదరిక నిర్మూలనకు, గ్రామాలాభివృద్ధికి ప్రణాళికలను సిద్ధం చేయాలని డీఆర్డీవో పీడీ సంపత్‌రావు పేర్కొన్నారు. గురువారం సంగెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కందకట్ల కళావతి అధ్యక్షతన జరిగిన అవగహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో పీడీ మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం నిధుల కేటాయింపు చేసేందుకు తగిన ప్రణాళికలను తయారు చేయాలన్నారు. ఇందుకోసం గ్రామాల్లో అన్ని శాఖ అధికారులతో సమావేశాలను ఏర్పాటు చేసి ప్రజల అవసరాలను తీర్చేందుకు ప్రజల సమక్షంలో ప్రణాళికలను రూపొందించు కోవాలన్నారు. ప్రభుత్వం 17 రకాల లక్షాలను రూపొందించిందని, ఇందులో 9 రకాల వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటికి అధిక ప్రాధాన్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లయ్య, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంపత్‌రావు

విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ కల్చరల్, జనవరి 18: విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అండర్-14 బాలుర, బాలికల విభాగంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 67వ రాష్ట్ర స్థాయి అంతర జిల్లాల కబడ్డీ క్రీడలు గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమానికి డీఈవో కె.రాము అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారుల తో మమేకమై కబడ్డీ ఆడారు. నిత్యం రాజకీయ కార్యకలాపాలతో బిజీబిజీగా గడిపే ఎమ్మెల్యే పల్లా కబడీ.. కబడ్డీ.. అంటూ కూతబెట్టి ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, ఏఎంవో శ్రీనివాస్, ఎంఎస్‌వో వి.రాజేందర్, పాఠశాల హెచ్ఎం జి.శ్రీనివాస్, రాష్ట్ర కబడ్డీ పరిశీలకులు రవికుమార్ పాల్గొన్నారు.

విజేతలు వీరే..

పట్టణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పోగుల నరేందర్‌గౌడ్, జిల్లా ఓలింపిక్ అసోసియేషన్ కన్వీనర్ టి.వెంకటేశ్వర్లు నేతృత్వంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన అంతర్ జిల్లాల క్రీడల్లో విజేతలను ప్రకటించారు. బాలుర విభాగంలో వరంగల్ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, నల్లగొండ ద్వితీయ, ఖమ్మం తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో నల్లగొండ ప్రథమ, వరంగల్ ద్వితీయ, ఖమ్మం తృతీయ స్థానంలో నిలిచాయి. అనంతరం తెలంగాణ రాష్ట్ర బాలికల, బాలుర జట్లను ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో ఈ నెల 28 నుంచి 30 వరకు జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో బాలికల జట్టు, జార్ఖండ్‌లో ఈ నెల 24 నుంచి 28 వరకు జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో బాలుర జట్టు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు.

ప్రాణం తీసిన అగ్గిపెట్టె..

మద్యం మత్తులో యువకుల గొడవ

ఇరువర్గాల దాడిలో చికిత్స పొందుతూ బాలుడి మృతి

రాయపర్తి, జనవరి 18: వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని ఓ గ్రామంలో అగ్గిపెట్టె వివాదం ఓ బాలుడు(17) ప్రాణం తీసింది. ఇరువర్గాల దాడిలో గాయపడిన బాలుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. రాయపర్తి ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పర్వతగిరి మండలంలోని ఓ గ్రామానికి బాలుడు(17) పండక్కి రాయపర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన తన పెద్దమ్మ ఇంటికి పండక్కి వచ్చాడు. స్థానిక యువకులు ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 15న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాత్రి మద్యం సేవించేందుకు వారితో వెళ్లాడు. అదే సమయంలో మరో గ్రూపు యువకులు అక్కడే మద్యం సేవించేందుకు వచ్చారు. మొదటి గ్రూపులోని వ్యక్తి తర్వాత వచ్చిన గ్రూపు వద్దకు వచ్చి అగ్గిపెట్టె కావాలని అడిగాడు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రెండో గ్రూపులోని వ్యక్తి మొదటి గ్రూపులోని వ్యక్తిని బీరు సీసాతో కొట్టాడు. దీంతో ఆ యువకుడు అక్కడ ఉన్న కర్రతో రెండో గ్రూపులోని బాలుడు(17)పై దాడి చేయడంతో అక్కడే స్పృహతప్పి పడిపోయాడు. దాడి జరుగుతున్న సమయంలో మిగతా వారు అక్కడి నుంచి పారిపోయారు. తర్వాత బాలుడి కోసం యువకులు రాగా, అప్పటికే అతడు గాయపడి కిందపడి పోయాడు. అనంతరం అతడిని తన పెద్దమ్మ ఇంటికి తీసుకెళ్లి అప్పగజెప్పారు. అయితే బాలుడు అతిగా మద్యం సేవించాడని భావించి పెద్దమ్మ ఇంట్లో పడుకోబెట్టింది. మర్నాడు(మంగళవారం) ఉదయం బాలుడు నిద్ర లేవకపోవడంతో అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని చికిత్స కోసం వరంగల్ తరలించగా, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పూర్తి దర్యాప్తు జరిపి ఘటన వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

ఖిలావరంగల్, జనవరి 18: మహిళలు, యువతలో దాగి ప్రతిభను గుర్తించేంది ముగ్గుల పోటీలని ఐద్వా రాష్ట్ర నాయకురాలు నలిగంటి రత్నమాల అన్నారు. గురువారం అఖిల భారతప్రజాత ంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఖిలావరంగల్‌లో ఏరియాలో ఠాగూర్ భవాని ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు గురువారం బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రదమ బహుమతి యాతం సుష్మ, ద్వితియ బహుమతి గజ్జేల భావన, తృతియబహుమతి కొత్త మల్లికాంబ, ప్రోత్సాహక బహుమతులు పుట్ట రమ్య, మందాటి హిమబిందు, అరికాల కళ, రాణి, రమ్య, లావణ్య తదితరులకు అందజేశారు.



మాట్లాడుతున్న ఐద్వా నాయకురాలు రత్నమాల

21న సీతారాముల వేషధారణ పోటీలు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 18: అయోధ్యలో బాలరా ముడిగా ఆలయ పునఃప్రతిష్ట జరుగుతున్న సమయంలో చిన్నారుల్లో రామనామ చైతన్యాన్ని, శ్రీరాముడి గొప్ప గుణగణాలను నింపాలని వరంగల్ మురుగన్ యాడ్స్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహి స్తున్నట్లు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లూరు మధు, సురేష్‌లు అన్నారు. 21న రామన్నపేటలోని సుశీల్ గార్డెన్‌లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు 15 సంవత్సరాలలోపు పిల్లలకు రాముడు, సీత, హనుమాన్ వేషధారణ పోటీలు ఉంటాయని అన్నారు. ఇ ందుకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం వైశ్య ఫెడరేషన్ కార్యాలయంలో ఆవిష్కరిం చారు. వివరాలకు సెల్ నంబర్ :72880 11111 లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.



బాలరాముని వేషధారణ పోటీలు పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైశ్య ఫెడరేషన్ సభ్యులు

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి

గీసుగొండ, జనవరి 18: ప్రజాప్రతినిధుల్లో సేవా చేయాలనే తపన, ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యం ఉంటేనే గ్రామాలు సమగ్రాభివృద్ధి చెందుతాయని జాతీయ ఆదర్శ గ్రామం మరియపురం సర్పంచ్ అల్లం బాలిరెడ్డి అన్నారు. గురువారం తిరుపతిలో జరిగిన జాతీయ హెల్త్ గ్రామపంచాయతీ సదస్సుకు తెలంగాణ నుంచి ఇద్దరు సర్పంచ్‌లు ఎంపిక కాగా అందులో బాలిరెడ్డి పాల్గొని మాట్లాడారు. గ్రామంలో వందశాతం ఇంకుడుగుంతలు, మరుగుదొడ్లు నిర్మించటం, పొడి, తడి చెత్త సేకరణ చేసి వర్మీ కంపోస్ట్ ఎరువు తయారు చేస్తున్నట్లు సదస్సులో వివరించారు. వృద్ధులకు యోగా క్లాస్‌లు, హెల్త్‌సెంటర్‌ను ఏర్పాటు చేయటంతో ఆరోగ్య గ్రామంగా గుర్తింపు వచ్చిందని వివరించారు. ఈమేరకు కేంద్ర, రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ అధికారుల బృందం బాలిరెడ్డిని సన్మానించి మెమొంటోను అందించారు.



బాలిరెడ్డికి మెమొంటోను అందచేస్తున్న విజయానందరెడ్డి

పార్టీ మారే ప్రసక్తే లేదు.. : అరూరి

హనుమకొండ టౌన్, జనవరి 18: తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని, తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని, పార్టీ క్యాడర్‌ను కంటికి రెప్పలా కాపాడుకుంటానని బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ స్పష్టం చేశారు. గురువారం హనుమకొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అరూరి రమేశ్ మాట్లాడారు. 2012లో బీఆర్ఎస్‌లో చేరిన తాను.. కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తున్నానని ఆయన తెలిపారు. తన పనితీరును గుర్తించిన కేసీఆర్.. వర్ధన్నపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా, మూడుసార్లు శాసనసభ సభ్యుడిగా అవకాశం ఇవ్వడంతో పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ కోసం పనిచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేని కొంతమంది దద్దమ్మలు తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఆయన అన్నారు. భవిష్యత్‌లో కేసీఆర్ నాయకత్వంలో పని చేయడంతో పాటు కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అరూరి రమేశ్ తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్‌రావు, సిరంగి సునిల్, జక్కుల రజిత వెంకటేశ్వర్లు, నేతలు వనంరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అరూరి రమేష్

సదరం శిబిరం విజయవంతం

వర్ధన్నపేట, జనవరి 18 : దివ్యాంగుల కోసం వర్ధన్నపేటలో గురువారం నిర్వహించిన సదరం శిబిరానికి వివిధ ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 99 మంది దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ సదరం క్యాంప్‌నకు 95 మంది పాల్గొనగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి తెలిపారు. అర్హులైన దివ్యాంగులందరికీ జిల్లా గ్రామీణా అభివృద్ధి సంస్థ కార్యాలయం నుంచి సర్టిఫికెట్లు అందజేస్తామని డీఆర్‌డీఏ పెన్షన్ విభాగం అధికారులు పేర్కొన్నారు. ఈ సదరం శిబిరంలో వైద్యాధికారులు డాక్టర్ చందునాయక్, ఫిజియోథెరపిస్టు నర్సింహా రెడ్డి, వేణు, డాక్టర్ భరత్, డీఆర్‌డీఏ సదరం విభాగం అధికారులు రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

56వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా మహేందర్ పటేల్

వడ్డెపల్లి, జనవరి 18 : గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా గోపాల్‌పూర్ ప్రాంతానికి చెందిన మందోటి మహేందర్ పటేల్ నియమితులయ్యారు. బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావుపద్మ ఈ మేరకు గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

గురుధామంలో 21న సీతారామ కల్యాణం

మట్టెవాడ, జనవరి 18: ఈనెల 21న శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ పట్టాభిషేకాన్ని నిర్వహిస్తున్నట్లు గురుధామం ట్రస్టీ టి.గోపిచందర్ తెలిపారు. గురువారం గీతామందిర్, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద పాంప్లెంట్స్, వాల్‌పోస్టర్లను పంపిణీ చేశారు. పాసులను కూడా పంపిణీ చేశారు. బండారు సత్యనారాయణ, మాదాపూర్ సదాశివుడు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణ కరపత్రాలను అందజేస్తున్న గోపిచంద్



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శుక్రవారం 19 జనవరి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దు



లెంకాలపల్లిలో మాట్లాడుతున్న సీఐ కిషన్

నల్లబెల్లి, జనవరి 18 : యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని రూరల్ సీఐ కిషన్ అన్నారు. మండలంలోని లెంకాలపల్లిలో బుధవారం రాత్రి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఆదేశాల మేరకు పోలీస్ జాగృతి కళా బృందం మూఢ నమ్మకాలపై, బాల్య వివాహాలపై, మానవ అక్రమ రవాణాపై, గుట్కా, గుడుంబా నియంత్రణ తదితర రుగ్మతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ కిషన్ మాట్లాడుతూ.. డయల్ 100 ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. అలాగే సీసీ కెమెరాల అవసరాన్ని, సైబర్ నేరాల జాగ్రత్తలను కూడా తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై నైనాల నగేష్, నాగమణి, వెంకటేశ్వర్లు, రత్తయ్య, శ్రీనివాస్, కానిస్టేబుల్‌లు, కళాజాత బృందం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌టీఆర్ వర్ధంతి



నర్సంపేటలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న టీడీపీ నాయకులు

నర్సంపేట, జనవరి 18 : తెలుగు దేశంపార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్య మంత్రి దివంగత నందమూరి తారక రామారావు (ఎన్‌టీఆర్) 28వ వర్ధంతి వేడుకలను గురువారం టీడీపీ నాయకు లు ఘనంగా నిర్వహించారు. నర్సంపేట పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్దకు టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి అడుప నర్సింగరావు, మహబూబాబాద్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వేములపల్లి సూర్య ప్రకాశ్, మహబూ బాబాద్ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మోతె సంపత్‌రెడ్డి ఆధ్వ ర్యంలో టీడీపీ నాయకులు చేరుకుని పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పేద ప్రజల కోసం పాటుపడిన మహానేత ఎన్టీఆర్ అని, ఎప్పటికి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నర్సంపేట మండల కమిటి అధ్యక్షుడు కొక్కు జంపయ్య, ఎండి.నాజర్, కొర్రరాజు తదితరులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట రూరల్ : మండలంలోని ఇల్లందలో ఎన్‌టీఆర్ విగ్రహానికి టీటీడీపీ నియోజకవర్గ ఇంచార్జీ చాడ మరియా పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ పేద ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి ఎన్‌టీఆర్ అని అన్నారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లనే భావనతో అట్టడుగు ప్రజానికానికీ రాజ్యాంగం బద్ధంగా రావాల్సిన వాటాలను వచ్చేలా చూశాడన్నారు. రైతులకు వైద్య, విద్య రంగాల్లో ప్రభుత్వ పరంగా సంక్షేమ ఫలాలు అందేలా చూశారని తెలిపారు.

• చెన్నారావుపేట : ఎన్‌టీ రామారావు వర్ధంతిలో భాగంగా మండల కేంద్రంలో టీడీపీ నాయకులు ఎన్‌టీఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిం చారు. అనంతరం పండ్లు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అల్లాడి నారాయణ, అడుప అశోక్, రొడ్డ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

• ఖానాపురం: ఎన్టీఆర్ వర్ధంతి వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ వేముల ఎల్లి ప్రకాశ్‌రావు, వేములపల్లి సూర్యప్రకాశ్‌రావు, కొత్త సురేష్, దేవినేని వేణుకృష్ణ, మౌళాన, గుర్లపెల్లి విజయ్, పరుచూరి రాజ, చిట్టిబాబు, మన్నెం సాంబశివరావు, పూర్ణచందర్, పూలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టె ఎరువులతో సాగు సులభం

• నేల సహజత్వాన్ని కాపాడే ఎరువు

వర్ధన్నపేట రూరల్, జనవరి 18 : ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించినప్పటికీ పంటల సాగులో విచక్షణా రహితంగా వినియోగించే రసాయ నాల ద్వారా అనేక అనర్థాలు సంభవిస్తున్నాయి. నేల భౌతిక లక్షణాలు దెబ్బతిని నీటిని నిల్వ చేసే సామ ర్థ్యాన్ని క్రమంగా కోల్పోతున్నాయి.

సూక్ష్మపోషక లోపాలు తరుచుగా కనపడుతున్నా యి. ఉత్పాదకత తగ్గి, ఖర్చు పెరిగిపోతోంది. ప్రస్తు తం రైతులు బోర్లు, బావులు, చెరువుల కింద యాసం గికి వరినార్లు పోస్తున్నారు. ఈ నేథ్యంలో నేల సహజ త్వాన్ని కాపాడుతూ అధిక దిగుబడులు పైర్లు ఎంత గానో సహకరిస్తాయి.

పచ్చిరొట్ట ఎరువులు, వాటి సాగు..

• తేలికగా చివికి పోయే స్వభావం కలిగి, నేలకు సత్తువను చూకూర్చే పంటలు, అటువంటి లక్షణాలు గల పంటల ఆకులను గానీ పచ్చిరొట్ట ఎరువులు అం టారు. పచ్చిరొట్ట పైర్లను పొలంలో చల్లి అవి పెరిగాక అదే పొలంలో కలియదున్ని పంట వేసుకోవడం. వాటి లో జీలుగ, జనుము, పిల్లి పెసర అలసంద, ఉలువ, పెసర వంటివి ఉంటాయి.

• పచ్చిరొట్ట ఆకులను బయట నుంచి సేకరించి పొలంలో కలియదున్ని కుళ్లనిచ్చి తర్వాత పంట వేసు కోవడం చాలా మంచిది. వాటిలో గ్లైరిసీడియా, జిల్లేడి, గానుగ, నేల తంగెడు ఉంటాయి.

• పొలం గట్ల వెంట బావుల దగ్గర గ్లైరిసీడియా చెట్లు నాటితే ఒక్కో చెట్టు ఏటా రెండు సార్లు (జూలై, డిసెంబరు నెలల్లో) 100-125 కిలోల పచ్చిరొట్టను ఇస్తుంది.

• ఎకరానికి జీలుగ 12 కిలోలు, జనుమ 16 కిలోలు, పిల్లిపెసర 8 కిలోలు, ఆలసంద ఎకరానికి 10 కిలోల విత్తనాలు వేసుకోవాలి.



పచ్చిరొట్టె సాగు

పంట లక్షణాలు..

త్వరగా ఎదిగి ఎక్కువ ఆకులు, పచ్చికాండం, ఇవ్వ గలిగే సామర్థ్యం, మొక్క భాగాలు మృదువుగా పెళు సుగా రసపూరితంగా ఉండి త్వరగా కుళ్లిపోయే స్వభా వం కలిగి ఉండాలి. అన్ని రకాల నేలలు, వాతావరణ పరిస్థితులు, నీటి ఎద్దడిని తట్టుకునే సామర్థ్యం కలిగి, పప్పు జాతికి చెందిన మొక్కలై ఉండాలి.

పైర్లు ప్రయోజనాలు...

పచ్చిరొట్ట పైర్లు నేలలో కుళ్లేటప్పుడు జరిగే రసా యన ప్రక్రియల వలన భూమిలోని పోషక పదార్థాలు మొక్కలకు సులభంగా లభ్యమవుతాయి. వీటి సాగు వలన నేల భౌతిక లక్షణాలు వృద్ధి చెందటమే కాకుం డా నత్రజని ఎరువుల వాడకాన్ని 25-30శాతం తగ్గిం చవచ్చు. నేల నీటి సామర్థ్యం వృద్ధిచెందటంతో పాటు నేల కోతను అరికడుతుంది. పచ్చిరొట్ట ఎరువులు, సేంద్రియ ఎరువులు, నీటి ద్వారా నేలలో మేలు చేసే సూక్ష్మ జీవులు వృద్ధి చెంది మొక్కలకు రోగని రోధక శక్తిని పెంచడంతో నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను అరికడుతుంది. భూమిగుల్ల బారి పంట మొక్కల వేర్ల కు అవసరమయ్యే గాలి, నీరు పుష్కలంగా అందుతా యి. దీర్ఘకాలిక పంటల్లో, పండ్లతోటల్లో పచ్చిరొట్ట పంటలను సాగు చేసి పూత దశలో కలియ దున్నడం వలన నేల సారవంతం అవుతుంది. చౌడు సమస్యను తొలగించడంతో పాటు భూసార పరిరక్షణకు తోడ్పడ తాయి. ముఖ్యంగా వరిసాగు చేసే ప్రాంతాల్లో వరి పంట ముందు పచ్చిరొట్ట పైర్లను సాగు చేయడం వలన బియ్యంలో విటమిన్లు, మాంసకృత్తుల శాతం పెరిగినట్లు పరిశోధనా ఫలితాల్లో వెల్లడైంది. దిగుబడి 15-20 శాతం పెరుగుతుందని రుజువైంది.

పంటలు విత్తే సమయం..

పచ్చిరొట్ట పైర్లను తొలకరి వర్షాలు మొదలైనప్పుడు నాటుకోవచ్చు. పచ్చిరొట్ట దిగుబడి నత్రజని స్థిరీకరణ, పైరు దశ మీద ఆధారపడి ఉంటుంది. సాధారణ దిగుబడి రావడానికి 45రోజుల సమయం పడుతుంది. పూత దశలో రొటోవేటర్ లేదా పవర్ టిల్లర్ సహా యంతో కలియ దున్నడం వలన భూమికి అత్యధిక సత్తువ చేకూర్చుతుంది. నత్రజని వృధాగా పోకుండా ఉండటానికి కనీసం 15-22 సెం.మీ. లోతులో కలియ దున్నాలి. మురుగు నీరుపోయే సౌకర్యంలేని వరి పొలాల్లో పచ్చిరొట్ట కుళ్లుతున్నప్పుడు మధ్యలో తయా రయ్యే కొన్ని వాయువులు అప్పుడే నాటిన వరి మొక్క లకు హాని కలిగిస్తాయి. కలియదున్నిన రెండు వారాల తర్వాత మాత్రమే నాట్లు వేసుకోవాలి.

• పచ్చిరొట్టె సాగుతో నేలకు లాభాలు..

రాంనర్సయ్య, ఏవో వర్ధన్నపేట



పచ్చిరొట్ట సాగుతో నేలకు లాభాలు ఎన్నో ఉన్నాయి. పంట లు వేసే ముందు వాటిని కలియ దున్నడం వలన నేల సాంద్రత పెరిగి భూమి బలంగా మారడం తో దిగుబడులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. రైతులు ప్రతి ఒక్కరూ పచ్చిరొట్టె సాగు చేసుకోవాలి.

29 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



వాహనాన్ని స్వాధీన పర్చుకున్న పోలీసులు

నెక్కొండ, జనవరి 18 : అక్రమంగా తరలిస్తున్న 29 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నెక్కొండ ఎస్సై షేక్ జాన్ పాషా గురువారం తెలిపారు. నెక్కొండలోని చల్లా గోదాము ల సముదాయం వద్ద పోలీ సులువాహనాల తనిఖీ నిర్వ హిస్తుండగా, టాటా ఏసీ వా హనంలో అక్రమంగా 29 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టు కున్నారని తెలిపారు. బియ్యంతో పాటు వాహనాన్ని స్వాధీన పర్చుకొని సిద్దిపేట జిల్లా నంగూనూరు గ్రామానికి చెందిన డ్రైవర్ మోతే సాయితరుణ్‌పై కేసు నమోదుచేశామన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసల పల్లి గ్రామంలోని నల్లా శ్రీధర్ ఇంటి నుంచి ఈ బియ్యాన్ని సిద్దిపేటకు తరలిస్తున్నట్లు విచారణలో తెలిందని చెప్పారు. ఈ కేసులో మరో నిందితుడు సిద్దిపేటకు చెందిన బాలయ్య అనే వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

కార్మిక శాఖ కార్యాలయం తనిఖీ



జిల్లా లేబర్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నర్సంపేట టౌన్, జనవరి 18 : నర్సంపేట పట్టణంలోని కార్మిక శాఖ కార్యాలయాన్ని జిల్లా లేబర్ ఆఫీసర్ రమేష్ బాబు గురువారం తనిఖీ చేశారు. కార్మిక శాఖ కార్యాల యంలో నెలకొన్న సమస్యలపై ఏఐటీయూసీ అనుబంధ టీఎస్‌బీకేసీడబ్ల్యూ జిల్లా కార్యదర్శి గోవర్ధన్ మియాపురం ఆధ్వర్యంలో ఇటీవల కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా లేబర్ ఆఫీసర్ రమేష్ బాబు కార్యాలయాన్ని తనిఖీ చేసి కార్మి కుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అనుబంధ టీఎస్‌బీకేసీడబ్ల్యూ జిల్లా కార్యదర్శి గోవర్ధన్ మియాపురం, టీఆర్ఎస్‌కేవీ జిల్లా కార్యదర్శి పాల డుగుల రమేష్, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం ఆధ్వర్యంలో డీసీఎల్‌కు పెండింగ్‌లో ఉన్న దరఖా స్తులను పరిష్కరించాలని, స్థానిక లేబర్ ఆఫీసర్ అందు బాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.



ప్రాణం తీసిన అగ్గిపెట్టె..

రాయపర్తి, జనవరి 18 : వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని ఓ గ్రామంలో అగ్గిపెట్టె వివాదం ఓ బాలుడి (17) ప్రాణం తీసింది. ఇరువర్గాల దాడిలో గాయపడిన బాలుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రాయపర్తి ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పర్వతగిరి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలుడు(17) పండక్కి రాయపర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన తన పెద్దమ్మ ఇంటికి వచ్చాడు. స్థానిక యువకులు ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 15న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రాత్రి మద్యం సేవించేందుకు వారితో వెళ్లాడు. అదే సమ యం లో మరో గ్రూపు యువకులు అక్కడే మద్యం సేవించేందుకు వచ్చారు. మొదటి గ్రూపులోని వ్యక్తి తర్వాత వచ్చిన గ్రూపు వద్దకు వచ్చి అగ్గిపెట్టె కావా లని అడిగాడు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రెండో గ్రూపులోని వ్యక్తి మొదటి గ్రూపులోని వ్యక్తిని బీరు సీసాతో కొట్టాడు. దీంతో ఆ యువకుడు అక్కడ ఉన్న కర్రతో రెండో గ్రూపులోని బాలుడు(17)పై దాడి చేయడంతో అక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. దాడి జరుగుతున్న సమ యంలో మిగతా వారు అక్కడి నుంచి పారిపోయారు. తర్వాత బాలుడి కోసం యువకులు రాగా, అప్పటికే అతడు గాయపడి కిందపడి పోయాడు.

అనంతరం అతడిని తన పెద్దమ్మ ఇంటికి తీసుకెళ్లి అప్ప జెప్పారు. అయితే బాలుడు అతిగా మద్యం సేవించాడని భావించి పెద్దమ్మ ఇంట్లో పడుకోబెట్టింది. మర్నాడు (మంగళవారం) ఉదయం బాలుడు నిద్రలేవకపోవడంతో అపస్మారక స్థితిలో ఉన్న బాలు డిని చికిత్స కోసం వరంగల్ తరలించగా, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పూర్తి దర్యాప్తు జరిపి త్వరలోనే ఘటన వివరాలు వెల్లడిస్తా మని ఎస్ఐ తెలిపారు.

మద్ది మేడారం జాతర కమిటీ ఎన్నిక



మద్ది మేడారం జాతర నూతన కమిటీతో మండల కాంగ్రెస్ పార్టీ కమిటీ

నల్లబెల్లి, జనవరి 18 : మండలంలోని మద్ది మేడారం జాతర నూతన కమిటీని ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల కమిటి తెలిపింది. ఈ సందర్భంగా మండలాధ్యక్షుడు చిట్యాల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశానుసారం మద్ది మేడారం జాతర నూతన కమిటీ చైర్మన్‌గా గాదె సుదర్శన్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. అలాగే 8 మంది డైరెక్టర్లులను కూడా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. మద్ది మేడారం జాత రను అన్ని రకాల సౌకర్యాలతో సమగ్ర అభివృద్ధి చేస్తామన్నారు. కార్య క్రమంలో డైరెక్టర్లులు కదురు నరేష్, మంద లింగారెడ్డి, అనుముల సంపత్, మేడిద కరుణాకర్, పెంతల బుచ్చిరెడ్డి, బుంపల్లి శ్రీనివాస్, కన్నబోయిన సాంబయ్య, సూరపనేని గోపాల్‌రావు, నాయకులు మాలోతు రమేష్, నైనాల అశోక్, మాలోతు మోహన్, మామిండ్ల రాజి రెడ్డి, జిల్లా మునేందర్ తదితరులు పాల్గొన్నారు.


గుండె పోటుతో కళాకారుడి మృతి

• బాధిత కుటుంబానికి పలువురి పరామర్శ



కనుకుల వేణు (ఫైల్)

చెన్నారావుపేట, జనవరి 18 : మండలంలోని లింగగిరి గ్రామానికి చెందిన కనుకుల వేణు (42) అనే పాటల కళాకారుడు గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామస్థుల కథనం ప్రకార వివరాలు ఇలా ఉన్నాయి ఇదే గ్రామానికి చెందిన వేణు మండల కేంద్రంలోని సిద్దార్థ గురుకుల హై స్కూల్‌లో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గతంలో తెలు గుదేశం ప్రభుత్వంలో జన్మభూమి కార్యక్రమంలో పాటలు పాడారు. అదేవిధంగా తెలంగాణ ఉద్యమంలో, పలువురు రాజకీయా నాయకుల ప్రచారంలో పాటలుపాడాడు. అంతే కాకుండా తన తండ్రితో కలిసి పౌరాణిక నాటకాలు వేశారు. వేణుకు గురువారం ఉదయం వేళల్లో ఛాతిలో మంటగా రావటంతో వెంటనే ఆర్ఎంపీ వైద్యుని వద్దకు వెళ్లాడు అక్కడే కింద కూలిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి నర్సంపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. మృతు నికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు, బాధిత కుటుంబాన్ని కళాకారుడు గిద్ద రాంనర్సయ్య బృం దం, సిద్దార్థ విద్యా సంస్థల చైర్మన్ గోపాల్‌రెడ్డి, హెచ్‌ఎం అండెం కర్ణాకర్‌రెడ్డి, మేడి రమేష్‌గౌడ్, పొన్నం రమేష్, ఉపాధ్యాయులు, డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు పాశం మల్లికార్జున్, లక్క రాజు, టేకుల స్వామి, రఘు, యాకుబ్, బాదావత్ రమేష్, ప్రశాంత్, అనిల్, స్వామి, మల్లయ్య, కుమారస్వామిలతో పాటు పలువురు పరామర్శించారు.



గ్రామ సభల్లో ప్రజలందరినీ భాగస్వాములుగా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో కల్పన

చెన్నారావుపేట. జనవరి 18: గ్రామాల అభివృద్ధి కోసం గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల్లో ప్రజలందరని భాగస్వాములుగా చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కల్పన అన్నారు. గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు అన్ని శాఖల మండల స్థాయి అధికారులతో గ్రామస్థాయి 2024-25 సంవత్సరానికి గాను డెవలప్‌మెంటు ప్లాన్, బ్లాక్ పంచాయతీ డెవలప్‌మెంట్ తయారు చేయుట గురించి ప్రత్యేక సమా వేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారం రోజుల్లో రెండు రోజుల పాటు గ్రామ సభలను నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ గ్రామ సభల్లో గ్రామ పంచాయతీల డెవలప్‌మెంట్ తయారు చేయటం జరుగుతుం దన్నారు. గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, ప్రజలందరూ భాగ స్వామ్యులు కావాలన్నారు.

• ప్రత్యేక సమావేశానికి హాజరు కాని ప్రజా ప్రతినిధులు

మండల పరిషత్ కార్యలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి 30 గ్రామాల సర్పంచ్‌లకు గాను ఒక్కరే పుల్లయ్యబోడ్ తండా సర్పంచ్ సమ్మునాయక్ హాజరు కాగా, ఎంపీటీసీలల్లో 11 మందికి గాను ఒక్కరు కూడా హాజరు కాలేదు. ప్రజా ప్రతినిధులు హాజరుకాకపోవటం పట్ల పలువురు అసహనం వ్యక్తం చేస్తు న్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భారతి, ఎంపీవో శ్రీధర్‌రాజు, సూపరింటెం డెంట్ దయాకర్, ఏఈ జోగానంద్, రఘు, సీసీ కట్టయ్య, ఏవో శశికాంత్, డాక్టర్ మంజీలాల్, సూపర్ వైజర్ మంజుల, రాధ, ఏపీవో అరుణ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

వర్ధన్నపేట, జనవరి 18 : ప్రజా సంక్షేమ పథకాలను సమాజంలోని అట్టడుగు స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలపై అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ అనే కార్య క్రమాన్ని దేశవ్యాప్తంగా చేపడుతుంది. ఇందులో భాగంగా గురువారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఎస్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏసీపీ రఘుచందర్ హాజరై మాట్లాడారు. సమాజంలో అట్టడుగున జీవిస్తు న్న ప్రజలు లబ్ధి పొందాలన్నదే కేంద్ర ప్రభుత్వం లక్ష్యమని, ఈ కార్యక్రమాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, బ్యాంకుఅధికారులు,సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం

దుగ్గొండి, జనవరి 18 : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ప్రణాళికలు తయారు చేయడం జరుగుతుందని, పెండింగ్‌లో ఉన్న వాటి సాధన కోసం పని చేయడం జరుగుతుందని టీఎస్ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని లక్ష్మీపురం ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించి ఏర్పాటుచేసిన సమావేశంలో శ్రీపాల్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ పదోన్నతులు, బదిలీలు, ఖాళీల భర్తీ తదితర వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకొని పోవడం జరిగింద న్నారు. ఉపాధ్యాయులకు అండగా నిలుస్తూ నిరంతరం పనిచేయడం జరుగుతుంద న్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శ్రీపాల్‌రెడ్డిని ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పరుపాటి సుధాకర్‌రెడ్డి, హెచ్‌ఎం కృష్ణమూర్తి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

నెక్కొండ, జనవరి 18 : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని గౌడ జనహ క్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేశ్ గౌడ్ డిమాండ్ చేశారు. నెక్కొండలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో గురువారం మోకు దెబ్బ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ అవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మల్ జిల్లా మామడ మండలానికి చెందిన బీజేపీ నాయకుడు ఏలేటి లింగారెడ్డి మంత్రి ప్రభాకర్‌గౌడ్‌ని అకారణంగా దూషించడం హేయమైన చర్య అన్నారు. బలహీన వర్గాలకు చెందిన ప్రజా ప్రతినిధులపై అగ్రకు లాలకు చెందిన వారు అనుచిత వ్యాఖ్యలు చేయడం అమానుషమన్నారు. ఈ కా ర్యక్రమంలో మాజీ ఎంపీపీ దొనికన సారంగపాణి, మోకు దెబ్బ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి దొంతి సంతోష్, గౌరవ అధ్యక్షుడు కారింగుల సురేష్, రాష్ట్ర నాయకులు అంబాల రాంగోపాల్, పులి బాబు, గిరగాని శ్రీనివాస్, పలుసం నవీన్, బొమ్మెర శ్రీనివాస్, కక్కెర్ల ఐలయ్య, లింగాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారే ప్రసక్తే లేదు..

» బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా.. » క్యాడర్‌ను కాపాడుకుంటా..

» బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్



మాట్లాడుతున్న అరూరి రమేశ్

హనుమకొండ టౌన్, జనవరి 18: తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్త ల్లో వాస్తవంలేదని, తాను బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని, పార్టీ క్యాడర్‌ను కంటి కి రెప్పలా కాపాడుకుంటానని బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ స్పష్టం చేశారు. గురువారం హనుమకొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అరూరి రమేశ్ మాట్లాడా రు. 2012లో బీఆర్ఎస్‌లో చేరిన తాను.. కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తున్నా నని తెలిపారు. తన పని తీరును గుర్తించిన కేసీఆర్.. వర్ధన్నపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా, మూడుసార్లు శాసనసభ సభ్యుడిగా అవకాశం ఇవ్వడంతో పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీకోసం పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేని కొంత మంది దద్దమ్మలు తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఆయన అన్నారు. భవిష్యత్‌లో కేసీఆర్ నాయకత్వంలో పని చేయడంతో పాటు కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అరూరి రమేశ్ తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో కార్పొరేటర్లు ఇండ్ల నాగేశ్వర్‌రావు, సిరంగి సునిల్, జక్కుల రజిత వెంకటేశ్వర్లు, నేతలు వనంరెడ్డి, రజినికుమార్, మల్లారెడ్డి, శ్రీధర్, వినోద్, శ్రీను, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీ కొట్టిన కారు

వర్ధన్నపేటరూరల్, జనవరి 18 : ప్రమాదవశాత్తు ఆటోను కారు ఢీ కొట్టడం తో పలువురికి గాయాలైన సంఘటన మండలంలోని కట్య్రాల గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరా లిలా ఉన్నాయి. కట్య్రాల గ్రామ శివారులోని పెట్రోల్ పంపు వద్ద తొర్రూరు నుంచి వరంగల్ వైపు వెళ్తున్న ఆటోను వెనుక నుంచి కారు ఢీ కొట్టడంతో ఆటో లో ఉన్న పలువురికి స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఉత్తమ వాటర్ ప్లాంట్‌గా అవార్డు అందుకున్న నాచినపల్లి

దుగ్గొండి, జనవరి 18: బాలవికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వ ర్యంలో మండలంలోని నాచినపల్లిలో ఏర్పాటు చేసిన బాల వికాస శుద్ధీకరణ వాటర్ ప్లాంట్ ఉత్తమ వాటర్ ప్లాంట్‌గా ఎంపికైంది. ఖాజీపేటలో మూడు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకుచెందిన వాటర్ ప్లాంట్‌ల మహా సభ గురువారం నిర్వహించగా ఉత్తమ వాటర్ ప్లాంట్‌గా నాచినపల్లి వాటర్ ప్లాంట్ ఎంపిక కాగా, బాలవికాస స్వ చ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు బాలక్కచే అవార్డు, జ్ఞాపక ను ప్లాంట్ అధ్యక్షుడు అద్మ రత్నాకర్‌రెడ్డి, ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పుచ్చకాయల కృష్ణారెడ్డి అందుకున్నారు. కార్యక్రమంలో ప్లాంట్ కోశాధికారి కన్నెబోయిన చంద్రమౌళి, సభ్యులు చెన్నూరి నర్సింహారెడ్డి, కందకట్ల రఘుపతి, బండారి ఉప్పలయ్య ఆపరేటర్ బాబర్ పాల్గొన్నారు.

పల్లె దీపాలు పాటల పుస్తకావిష్కరణ

దుగ్గొండి, జనవరి 18 : మండలంలోని తొగర్రాయి ఉన్న త పాఠశాలలో సాంఘిక శాస్త్రఉపాధ్యాయుడిగా విధులు నిర్వ హిస్తున్న చిలువేరు శ్రీనివాస్‌లు రచించిన పల్లె దీపా లు పాటల పుస్తకాన్ని గురువారం హెచ్‌ఎం, ఎస్.వెంకటేశ్వ ర్లు అవిష్కరణ చేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సం బంధించిన పల్లె పాటలు, జీవన విధానంతో కూడిన పాట లను రచించడం పట్ల రచయిత శ్రీనివాస్‌ను హెచ్‌ఎం అభి నందించారు. పాటల పుస్తకాలను పీఎస్, ఉన్నత పాఠశా లల గ్రంథాలయాలకు వితరణ చేశారు. ఉపాధ్యాయులు నాగేశ్వరచారి, సారయ్య, సుశీల, రఘు,కౌర్, స్వప్న, ఐలయ్య, పద్మశ్రీ, వీరస్వామి, నీరజ, విష్ణు వర్ధన్ పాల్గొన్నారు.

సదరం శిబిరం విజయవంతం

వర్ధన్నపేట, జనవరి 18 : దివ్యాంగుల కోసం వర్ధన్నపేట లో గురువారం నిర్వహించిన సదరం శిబిరానికి వివిధ ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 99 మంది దివ్యాంగులు దరఖా స్తు చేసుకున్నప్పటికీ సదరం క్యాంప్‌నకు 95మంది పాల్గొన గా నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి తెలిపారు. అర్హు లైన దివ్యాంగులందరికీ జిల్లా గ్రామీణా అభివృద్ధి సంస్థ కార్యాలయం నుంచి సర్టిఫికెట్లు అందజేస్తామని డీఆర్‌డీఏ పెన్షన్ విభాగం అధికారులు పేర్కొన్నారు. ఈ సదరం శిబి రంలో వైద్యాధికారులు డాక్టర్ చందునాయక్, ఫిజియోథెరా ఫిస్టు నర్సింహా రెడ్డి, వేణు, డాక్టర్ భరత్, డీఆర్‌డీఏ సదరం విభాగం అధికారులు రవి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.